RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | శుక్రవారం, మే 15, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 33 | పేజీలు: 8 | వెల : రూ.1



ఒమన్ తీరంలో భారత నౌకపై దాడి..

## సముద్రంలో మునిగిన 'హాజీ అలీ'

దాడిలో మంటలు చెలరేగి సముద్రంలో మునిగిన నౌక

నౌకలోని 14 మంది సిబ్బందిని సురక్షితంగా రక్షించిన ఒమన్ కోస్ట్ గార్డ్

ఈ దాడిని తీవ్రంగా ఖండించిన భారత ప్రభుత్వం

సిబ్బందిని భారత్‌కు తీసుకొచ్చేందుకు అధికారుల ఏర్పాట్లు




## దేశ సమగ్ర ప్రగతికి ప్రజా భాగస్వామ్యం అత్యంత కీలకం

: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు



## కేరళం ముఖ్యమంత్రిగా సతీశన్

## వర్క్ ఫ్రమ్ హోమ్‌తో రోజుకు 4 కోట్ల ఆదా



# ఏపీలో ఒక రోజు నో వెహికల్ డే

::: కేబినెట్ కీలక నిర్ణయం



విజయవాడ, మే 14, (వాయిస్‌టుడే) : ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక సంక్షోభాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. "నా దేశం – నా బాధ్యత" అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాబోయే క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమాజం సిద్ధంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ ముందుజాగ్రత్త చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు.ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల వల్ల ఇంధన దిగుమతులు, విదేశీ మారక ద్రవ్యంపై తీవ్ర ఒత్తిడి పడుతోందని, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉందని మంత్రి వివరించారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, పొదుపు చర్యలు పాటించడం ద్వారా దేశానికి మేలు చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చినట్లు తెలిపారు.ఈ పొదుపు చర్యలు తొలుత ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచే ప్రారంభం కావాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని పార్థసారథి తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ కాన్వాయ్‌లలో వాహనాల సంఖ్యను గణనీయంగా తగ్గించుకోవాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలను పూర్తిగా రద్దు చేసుకోవాలన్నారు. వీలైతే ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని, సమీప ప్రాంతాలకు వెళ్లేటప్పుడు కార్లకు బదులుగా నడక లేదా సైకిల్‌ను ఆశ్రయించాలని సీఎం కోరారు.వారానికి ఒక రోజు (శుక్రవారం) 'నో వెహికల్ డే' పాటించాలని, ఆ రోజు వాహనాలు వినియోగించకుండా వర్చువల్ విధానంలో సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. అధికారులు కూడా వాహనాలను షేర్ చేసుకోవడం ద్వారా ఇంధనాన్ని ఆదా చేయాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఇంధన వినియోగంపై వారానికోసారి సమీక్షించాలని, కొత్తగా కొనుగోలు చేసే వాహనాలు ఎలక్ట్రిక్ (ఈవీ) వాహనాలే అయి ఉండాలని క్యాబినెట్ నిర్ణయించింది.ప్రజలు కూడా ఈ సంక్షోభ సమయంలో బాధ్యతగా వ్యవహరించాలని

(మిగతా 2వ పేజీలో)



## పారదర్శకమైన విచారణ జరిపించాలి

హైదరాబాద్, మే 14, (వాయిస్‌టుడే) : నీట్ యూజీ 2026 పరీక్ష రద్దు, పేపర్ లీక్ అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. దేశవ్యాప్తంగా సుమారు 22.79 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశంపై కేంద్రం పారదర్శకమైన విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. పరీక్ష రద్దు నిర్ణయంతో లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఇలాంటి ఘటనలు పరీక్షల వ్యవస్థపై ఉన్న విశ్వసనీయతను దెబ్బతీస్తాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా పేపర్ లీక్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని, విద్యార్థులు మళ్లీ ఇబ్బంది పడకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణమే పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. పోటీ పరీక్షలు అనేవి విద్యార్థుల ప్రతిభకు వేదిక కావాలి తప్ప, వారి జీవితాలను నాశనం చేసే సాధనాలుగా మారకూడదని ఆయన హితవు పలికారు. ఇదే సమయంలో ఆయన రాజకీయంగా కూడా విమర్శలు గుప్పించారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, పేపర్ లీక్ ఘటనల విషయంలో గత ప్రభుత్వ తీరు, ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ వైఖరి ఒకేలా ఉందంటూ రేవంత్ రెడ్డి చురకలు అంటించారు.ఈనెల 3వ తేదీన దేశంలోని 551 నగరాల్లో.. విదేశాల్లోని 14 నగరాల్లో సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు.. పరీక్షకు హాజరయ్యారని.. ఇప్పుడు పేపర్ లీకులు, పరీక్ష నిర్వహణలో జరిగిన

(మిగతా 2వ పేజీలో)



## బండి చుట్టూ రాజకీయం...

హైదరాబాద్,మే 14, (వాయిస్‌టుడే) : తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు మునుపెన్నడూ లేని విధంగా అత్యంత వ్యక్తిగత స్థాయికి చేరుకున్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు ఇప్పుడు కేవలం ఒక నేరపూరిత దర్యాప్తుగా మిగలకుండా, రాష్ట్రంలో రాజకీయ సెగలు పుట్టిస్తోంది. బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, శేరిలింగంపల్లి వంటి ప్రధాన ప్రాంతాల్లో బండి భగీరథ్ పరారీ అంటూ వెలిసిన పోస్టర్లు ఈ వివాదాన్ని మరో స్థాయికి తీసుకెళ్లాయి. అసలు ఈ పోస్టర్లు ఎవరు వేశారు? దీని వెనుక ఉన్న రాజకీయ శక్తులు ఏవి? అన్నది పక్కన పెడితే, ప్రత్యర్థిని దెబ్బతీయడానికి కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.ఈ వ్యవహారం రెండు భిన్నమైన కథనాల మధ్య నలుగుతోంది. ఒక వైపు, ఒక మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగిందని, ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని ప్రాసిక్యూషన్ చెబుతోంది. మరోవైపు, ఇది పక్కాగా ప్లాన్ చేసిన హనీ ట్రాప్ అని, రూ. 5 కోట్ల వరకు డిమాండ్ చేస్తూ బ్లాక్‌మెయిల్ చేశారని భగీరథ్ తరపున కౌంటర్ ఫిర్యాదు నమోదైంది. చట్టం తన పని తాను

(మిగతా 2వ పేజీలో)

## దేశంలో వేల కోట్ల లీటర్ల పెట్రోల్-డీజిల్ వాడకం



న్యూఢిల్లీ మే 14, (వాయిస్‌టుడే) : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ టీవీలో హైదరాబాద్ పర్యటన సందర్భంగా దేశ ప్రజలకు కొన్ని కీలక సూచనలు చేశారు. అందులో ఇంధన పొదుపు ఒకటి. ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ఇంధన వినియోగం తగ్గించాలని సూచించారు. వర్క్ ఫ్రం హోం చేయాలన్నారు. ప్రధానమంత్రి పిలుపునిచ్చిన నేపథ్యంలో, తన కాన్వాయ్‌లో ఉపయోగించే వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని ఆదేశించారు. ప్రభుత్వ వర్గాలు తెలిపినట్లుగా, ఇది సాధారణ పెట్రోల్–డీజిల్ వాహనాలను తగ్గించి, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వాడకాన్ని పెంచడానికి దిశానిర్దేశం. భారతదేశంలో వార్షికంగా 2 వేల కోట్ల లీటర్ల పెట్రోల్–డీజిల్ వాడకం జరుగుతున్న నేపథ్యంలో, ఇటువంటి చర్యలు లక్షలాది కోట్ల రూపాయల ఆదాను తీసుకొస్తాయని నిపుణులు అంచనా. పొదుపు తన నుంచే మొదలు పెట్టాలని మోడీ కీలక ఆదేశాలు ఇచ్చారు.స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్ పీ జీ) ఈ ఆదేశాన్ని అమలు చేస్తూ, ప్రధాని భద్రతా ప్రోటోకాల్‌కు

(మిగతా 2వ పేజీలో)



## కేటీఆర్ తో భారతదేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ భేటీ

హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో భారతదేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్గీచీ తో ఈరోజు సమావేశమయ్యారు. నందినగర్ లో జరిగిన ఈ భేటీలో పరస్పర ప్రయోజనాలు మరియు వ్యూహాత్మక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, మరియు విద్యారంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ఈ సమావేశంలో ప్రస్తావించారు. గతంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ ఆఫ్ ప్రజలు



# ఏపీలో ఒక రోజు నో వెహికల్ డే

మంత్రి కోరారు. విహారయాత్రల కోసం విదేశాలకు వెళ్లే బదులు స్వదేశీ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. బంగారం కొనుగోళ్లపై మోజు తగ్గించుకోవాలని, దీనివల్ల ఏటా వేల కోట్ల డాలర్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందని అన్నారు. "స్టెప్ ఫర్ ది నేషన్" పేరుతో నడక, సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు ప్రచార కార్యక్రమాలు చేపడతామన్నారు.ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఇంధన, వ్యవసాయ రంగాల్లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టాలని సీఎం ఆదేశించారన్నారు. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు 'పీఎం సూర్యఘర్', 'కుసుమ్' వంటి సౌర విద్యుత్ పథకాలను మరింత వేగవంతం చేయాలని ఇంధన శాఖను ఆదేశించినట్లు చెప్పారు. ప్రస్తుతం లక్షల మందికి మాత్రమే చేరిన ఈ పథకాలను విస్తృతం చేసేందుకు అవసరమైన పరికరాల తయారీదారులతో, సప్లై చైన్‌తో చర్చలు జరపాలని సూచించారన్నారు. అలాగే, కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) వంటి ప్రత్యామ్నాయ ఇంధన ప్లాంట్ల ఏర్పాటుకు భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారన్నారు.వ్యవసాయ రంగంలో రసాయనిక ఎరువుల వాడకం విపరీతంగా పెరిగిపోయిందని, ముఖ్యంగా యూరియా వినియోగంలో రైతుల మధ్య చాలా వ్యత్యాసం ఉందని పార్థసారథి ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు రైతులు ఎకరానికి రెండు బస్తాలు వాడుతుంటే, మరికొందరు మూడు, నాలుగు బస్తాలు వాడుతున్నారని, ఇది శాస్త్రీయంగా సరైంది కాదన్నారు. అధిక దిగుబడి కోసం కెమికల్స్ వాడకం వల్ల భూసారం దెబ్బతింటోందని, దీన్ని తగ్గించేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖకు సీఎం సూచించారని తెలిపారు. దీనికి ప్రత్యామ్నాయంగా వచ్చిన 'నానో యూరియా' వాడకాన్ని ప్రోత్సహించాలని కోరారు. డ్రోన్ల సహాయంతో నానో యూరియాను పొలం అంతటా సమానంగా చల్లడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని, రైతులు ఈ దిశగా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

### హైబ్రీడ్ విధానంపై చర్చ

సశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పొదుపు పిలుపునకు ఏపీ ప్రభుత్వం స్పందించింది. ఇంధన సంక్షోభాన్ని నివారించే ముందస్తు చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అమలు చేసే అంశంపై ఏపీ సర్కార్ తీవ్రంగా యోచిస్తోంది. కరోనా మహమ్మారి సమయంలో ప్రాచుర్యం పొందిన ఈ విధానం, మళ్లీ ఇప్పుడు యుద్ధ పరిస్థితుల కారణంగా తెరపైకి వచ్చింది. ప్రధాని మోదీ దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ప్రభావం భారత్‌పైనా ఉంటుందని, ప్రజలందరూ పొదుపు పాటించాలని సూచించారు. ముఖ్యంగా ఇంధనం వాడకాన్ని తగ్గించడం, అనవసర ప్రయాణాలు మానుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే ఆయన వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని ఒక పరిష్కారంగా ప్రస్తావించారు.ప్రధాని సూచనల తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు కూడా ఈ విషయంపై స్పందించారు. ఏపీలో ప్రభుత్వ రంగంలోనూ వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. భవిష్యత్తులో ప్రపంచమంతా ఇంటి నుంచే పనిచేసే రోజులు రాబోతున్నాయని, దానికి అనుగుణంగా మన ఆలోచనా విధానంలో మార్పు రావాలని ఆయన పేర్కొన్నారు. ఇంధన పొదుపు కోసం అనవసర ప్రయాణాలు తగ్గించి, టెలి, వీడియో కాన్ఫరెన్స్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు.చంద్రబాబు వ్యాఖ్యల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ అమలుకు సంబంధించిన ప్రతిపాదనలపై ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంటి నుంచి పనిచేసేందుకు వీలున్న విభాగాలు, కార్యాలయాలకు తప్పనిసరిగా హాజరుకావాల్సిన ఉద్యోగులను గుర్తించే ప్రక్రియ చేపట్టనున్నారు. కొందరికి పూర్తిగా వర్క్ ఫ్రమ్ హోమ్, మరికొందరికి హైబ్రిడ్ విధానంలో (కొన్ని రోజులు ఇల్లు, కొన్ని రోజులు ఆఫీస్) పనిచేసే అవకాశాన్ని కల్పించే అంశాలను పరిశీలిస్తున్నారు

### ముందు జాగ్రత్తే కానీ, భయం వద్దు

ఈ చర్యలన్నీ ప్రజలను భయపెట్టడానికి కాదని, కేవలం సంభావ్య సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి సమాజాన్ని సన్నద్ధం చేయడానికేనని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. "రాబోయే ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి తప్ప, ఆదాయం తగ్గిపోతుందని ఆలోచించకూడదు. దేశ ప్రయోజనాలే ముఖ్యం" అని ఆయన పేర్కొన్నారు. ఇంధన పొదుపు వల్ల రాష్ట్రానికి వచ్చే పన్ను ఆదాయం తగ్గవచ్చనే ప్రశ్నకు ఆయన ఈ విధంగా సమాధానమిచ్చారు. ప్రభుత్వం ఇతర మార్గాల్లో ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిస్తోందని, త్వరలోనే రాష్ట్రానికి రూ. 1.5 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు రాబోతున్నాయని తెలిపారు. ఈ పొదుపు చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐడపీఆర్ శాఖ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని మంత్రి కొలుసు పార్థసారథి వివరించారు.

# వర్క్ ఫ్రమ్ హోమ్‌తో రోజుకు 4 కోట్ల ఆదా

హైదరాబాద్, మే 14, (వాయిస్‌టుడే) : మనదేశంలో పేరుపొందిన ఐటి నగరాలలో హైదరాబాద్ ముందు వరుసలో ఉంటుంది. ఫార్మా లో కూడా హైదరాబాద్ నగరానికి తిరుగులేని స్థాయి ఉంది. అతిపెద్ద కంపెనీలు.. అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఫలితంగా హైదరాబాద్ స్థాయి గ్లోబల్ రేంజ్ ను మించిపోయింది. మన దేశ ఆర్థిక రాజధాని ముంబైతో హైదరాబాద్ పోటీ పడుతుంది. హైదరాబాద్ నగరంలో పెద్ద పెద్ద కంపెనీలు ఏర్పాటైన నేపథ్యంలో.. ఉద్యోగులు కూడా అదే స్థాయిలో ఉన్నారు. హైదరాబాదులోనే వారు స్థిర నివాసం ఏర్పరచుకోవడంతో.. హైదరాబాద్ నగరం అంతకంతకు విస్తరిస్తోంది.హైదరాబాదు నగరంలోని ఐటీ కారిడార్ ప్రాంతంలో దాదాపు తొమ్మిది లక్షల మందికి పైగా పనిచేస్తున్నారు. వీరిలో చాలామంది సొంత వాహనాలలో ఆఫీస్ కు వస్తుంటారు. కొన్ని కంపెనీలు గతంలో ప్రయాణ సౌకర్యాన్ని అందించేవి. ఖర్చులను తగ్గించుకోవడానికి చాలావరకు కంపెనీలు ప్రయాణ సౌకర్యాన్ని తగ్గించేశాయి. దీంతో ఉద్యోగులు మొత్తం సొంత వాహనాలలో కార్యాలయాలకు వస్తున్నారు. దీంతో హైదరాబాద్ నగరంలో పెట్రోల్ వినియోగం పెరిగిపోయింది.. పెట్రోల్ వినియోగం పెరిగిపోవడం వల్ల సహజంగానే కాలుష్యం కూడా పెరిగిపోతూ ఉంటుంది.ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్క్ ఫ్రం హోం చేసుకోవాలని సూచించారు. అంతర్జాతీయంగా యుద్ధ ప్రభావాలు ఇంకా తగ్గలేదని.. దీనివల్ల మన దేశం మీద తీవ్రమైన ఒత్తిడి ఉందని.. అందువల్ల ఉద్యోగులు ఇంటి నుంచి పని చేయడానికి ఆసక్తిని చూపించాలని సూచించారు. ప్రధానమంత్రి కీలక వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఐటీ కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోం విధానానికి మరోసారి శ్రీకారం చుడుతున్నట్టు తెలుస్తోంది.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఒకసారి హైదరాబాద్ లో ఉన్న పరిస్థితిని అంచనా వేస్తే..హైదరాబాదు నగరంలో ఐటి కారిడార్ ప్రాంతంలో 9 లక్షల మందికిపైగా పనిచేస్తూ ఉంటారు. వీరిలో చాలామంది సొంత వాహనాలలో ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు.



ఇందులో సగం మంది(4.5 లీటర్లు) కి వర్క్ ఫ్రం హోం ఇచ్చినా.. రోజుకు 3.6 లక్షల లీటర్ల పెట్రోల్ ఆదా అవుతుంది. ఒక్కో వ్యక్తి సగటున 20 కిలోమీటర్లు ప్రయాణిస్తారు అనుకుంటే మొత్తం 90 లక్షల కిలోమీటర్లు అవుతుంది. లీటర్ కు సగటున 25 కిలోమీటర్ల మైలేజీ వస్తుంది అనుకుంటే 3.87 కోట్లు ఆదా అయినట్టే. ప్రస్తుతం లీటర్ పెట్రోల్ ధర 107.50 గా ఉంది. హైదరాబాద్ నగరంలోనే ఇలా ఉంటే, ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్ కతా, వంటి నగరాలలో కూడా ఇదే విధానాన్ని కొనసాగిస్తే మరింత పెట్రోల్ ఆదా అవుతుందని.. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మీద ఒత్తిడి తగ్గుతుందని నిపుణులు సూచిస్తున్నారు.



### ఒమన్ తీరంలో భారత నౌకపై దాడి..

# సముద్రంలో మునిగిన 'హాజీ అలీ'

**దాడిలో మంటలు చెలరేగి సముద్రంలో మునిగిన నౌక**


**నౌకలోని 14 మంది సిబ్బందిని సురక్షితంగా రక్షించిన ఒమన్ కోస్ట్ గార్డ్**

**ఈ దాడిని తీవ్రంగా ఖండించిన భారత ప్రభుత్వం**

**సిబ్బందిని భారత్‌కు తీసుకొచ్చేందుకు అధికారుల ఏర్పాట్లు**

ఒమన్ జలాల్లో భారత జెండాతో ప్రయాణిస్తున్న 'హాజీ అలీ' అనే నౌక దాడికి గురై సముద్రంలో మునిగిపోయింది. అయితే, నౌకలోని 14 మంది సిబ్బందిని సురక్షితంగా కాపాడినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వాణిజ్య నౌకలపై జరిగిన ఈ దాడి 'అంగీకారయోగ్యం కాదు' అని తీవ్రంగా ఖండించింది. సోమాలియా నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని షార్జాకు సరుకుతో వెళ్తుండగా బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. గుర్తుతెలియని దాడి వల్ల నౌకలో మంటలు చెలరేగి, అది సముద్రంలో పూర్తిగా మునిగిపోయింది. వెంటనే స్పందించిన ఒమన్ కోస్ట్ గార్డ్ నౌకలోని 14 మంది సిబ్బందిని సురక్షితంగా రక్షించి సమీపంలోని దిబ్బా పోర్టుకు తరలించారు. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. "వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం, అమాయక సిబ్బంది ప్రాణాలను ప్రమాదంలో పడేయడం వంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. స్వేచ్ఛా వాణిజ్యం, నౌకాయానానికి ఆటంకం కలిగించవద్దు" అని ఓ ప్రకటనలో పేర్కొంది. సిబ్బంది అంతా క్షేమంగా ఉన్నారని, వారిని భారత్‌కు తిరిగి తీసుకురావడానికి ఒమన్ అధికారులతో సమన్వయం చేస్తున్నామని పోర్ట్స్ అండ్ షిప్పింగ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ముఖేశ్ మంగళ్ తెలిపారు. మరోవైపు, ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, భారత్‌కు ఎల్‌పీజీతో వస్తున్న రెండు విదేశీ ట్యాంకర్లు హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# కేరళం ముఖ్యమంత్రిగా సతీశన్..



తిరువనంతపురం, మే 14 : మే 4న కేరళం శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన దాదాపు 10 రోజుల తర్వాత, ఈ రోజు (మే 14) కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిని ప్రకటించింది. వి.డి. సతీశన్ కేరళం తదుపరి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. 140 స్థానాలున్న కేరళం అసెంబ్లీలో 102 స్థానాలు గెలుచుకున్న యూడీఎఫ్ కూటమికి సారథ్యం వహించిన ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టబోతున్నారు.ఎన్నికల ఫలితాలు వెలువడిన పది రోజుల వరకు ముఖ్యమంత్రి ఎవరనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ అధిష్ఠానం ముందు ముగ్గురు కీలక నేతలు వీడీ సతీశన్, కేసీ వేణుగోపాల్, రమేషన్ చెన్నితల రేసులో నిలిచారు. మెజారిటీ ఎమ్మెల్యేలు వేణుగోపాల్ వైపు మొగ్గు చూపినప్పటికీ క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్, సామాన్య ప్రజానీకం సతీశన్ వైపు నిలబడటంతో కాంగ్రెస్ ఆ పేరును ఎంపిక చేసింది. పార్టీ కార్యకర్తల నుంచి ఒత్తిడి, యూడీఎఫ్ మిత్ర పక్షాలైన ముస్లిం లీగ్ వంటి పార్టీల మద్దతుతో కాంగ్రెస్ హైకమాండ్ సతీశన్ వైపు మొగ్గు చూపింది.

### క్యాంపస్ రాజకీయాల నుంచి క్లిఫ్ హౌస్ వరకు

1964మే 31న ఎర్నాకులం జిల్లా నెట్టూరులో జన్మించిన సతీశన్, విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుగ్గా ఉండే వారు. మహాత్మా గాంధీ యూనివర్శిటీ యూనియన్ ఛైర్మన్‌గా పని చేసిన ఆయన తర్వాత నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా కార్యదర్శిగా ఎదిగారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన సతీశన్, సుమారు పదేళ్ల పాటు కేరళం హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. 1996లో రాజకీయాల్లోకి వచ్చి పరవూరు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత నిరంతరం ప్రజల్లో ఉంటూ 2001లో అదే స్థానం నుంచి విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టారు. అప్పటి నుంచి నేటి వరకు పరవూరును అజేయమైన కోటగా మార్చుకున్నారు. 2026 ఎన్నికల ప్రచారంలో యూడీఎఫ్ వంద శాతానికిపైగా సీట్లు సాధిస్తుంది ఆయన ముందే చెప్పారు. కేరళంలో విజయం సాధించిన తర్వాత ముఖ్యమంత్రిగా ఎవరిని నియమించాలనే విషయంపై జాప్యం జరిగింది. పది రోజులుగా ఈవిషయాన్ని సాగదీయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. చివరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీతో పాటు ఇతర సీనియర్ పార్టీ నాయకులు హాజరైన ఒక ఉన్నత స్థాయి కాంగ్రెస్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం పేరు ప్రకటించారు. 140 మంది సభ్యులున్న కేరళం అసెంబ్లీలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ 102 సీట్లు గెలుచుకుని మెజారిటీ సాధించింది. అయినప్పటికీ, ముఖ్యమంత్రిని నిర్ణయించడంలో జరిగిన జాప్యంపై ప్రశ్నలు తలెత్తాయి. ముఖ్యమంత్రి పేరును ప్రకటించడంలో జాప్యం చేసినందుకు ప్రతిపక్షాలు కాంగ్రెస్ పార్టీని విమర్శించగా, పార్టీలో కూడా అసంతృప్తి స్పష్టంగా కనిపించింది. వయనాడ్‌లోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సమీపంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను విమర్శిస్తూ పోస్టర్లు వెలిశాయి. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేక సెంటిమెంట్ నెలకొని ఉన్నప్పటికీ, ఈ ఇద్దరు నాయకులు కేసీ వేణుగోపాల్‌ను కేరళం ముఖ్యమంత్రిని చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆ పోస్టర్లలో విమర్శలు చేశారు.

# దేశ సమగ్ర ప్రగతికి ప్రజా భాగస్వామ్యం అత్యంత కీలకం

### : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు

హైదరాబాద్ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు చేసిన '7 విజ్ఞప్తుల'పై రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత తరుణంలో 'జన్ భాగీదారీ' (ప్రజా భాగస్వామ్యం) అనేది అత్యంత ఆవశ్యకమని నేను స్పష్టం చేశాను. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు; ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఈ జాతీయ యజ్ఞంలో తమ వంతు కృషి చేయాలని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సూచనలకు ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవు. అవి దేశ ఆర్థిక భద్రత, సామాజిక బాధ్యత మరియు దీర్ఘకాలిక జాతీయ ప్రయోజనాలకు ముడిపడి ఉన్న అంశాలు. 'వోకల్ ఫర్ లోకల్' అనే స్ఫూర్తితో.. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ, మన దేశీయ ఆర్థిక వ్యవస్థను రక్షించుకోవడంతో పాటు దాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, ప్రజలు అనవసర ఖర్చుల విషయంలో సంయమనం పాటించాలి. తన కాన్వాయ్లోని వాహనాల సంఖ్యను తగ్గించుకోవడం ద్వారా స్వయంగా ప్రధానమంత్రే మనందరికీ గొప్ప ఆదర్శంగా నిలిచారు. గౌరవ ప్రధాని ఇచ్చిన ఈ పిలుపును స్ఫూర్తిగా తీసుకుని, జాతి నిర్మాణంలో చురుకుగా పాల్గొనాలని తెలంగాణ ప్రజలందరికీ నేను మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాను. దేశ సమగ్ర ప్రగతికి ప్రజా భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. .

# పారదర్శకమైన విచారణ జరిపించాలి

అవకతవకల కారణంగా ఇప్పుడు మళ్లీ వారు తీవ్ర ఆందోళనలో పడినట్లు చెప్పారు. పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. మరోసారి విద్యార్థులు ఇబ్బందులు పడకుండా కేంద్రం అన్ని రకాల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.జాతీయ స్థాయి పరీక్షల విశ్వసనీయతను అన్ని విధాలుగా కాపాడాలని సూచించారు. ప్రశ్నపత్రాల లీకులు లేదా అవినీతికి పాల్పడిన ఏ వ్యక్తి అయినా నెట్‌వర్క్ అయినా.. వారి పలుకుబడి లేదా హోదాతో సంబంధం లేకుండా అత్యంత కఠినమైన శిక్షను ఎదుర్కోవాల్సిందేనని తేల్చి చెప్పారు. ఈ పేపర్ లీకేజీ ఘటనతో ప్రభావితం అయిన విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.నీట్ రాసే విద్యార్థులు ఎన్నో త్యాగాలు, మానసిక ఒత్తిడి, ఆర్థిక భారాన్ని తట్టుకుని.. మరీ పరీక్షకు సిద్ధమవుతారని.. ఈ నేపథ్యంలోనే పోటీ పరీక్షలు విద్యార్థుల ఆందోళన, అనిశ్చితికి కాకుండా.. అవకాశాలు, ప్రతిభకు సాధనాలుగా మారాలని రేవంత్ రెడ్డి హితవు పలికారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ఉండేందుకు పటిష్టమైన రక్షణ చర్యలు, టెక్నికల్ సెక్యూరిటీ, జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# బండి చుట్టూ రాజకీయం...

చేసుకుపోవాల్సి ఉండగా, సోషల్ మీడియా వేదికగా సాగుతున్న ట్రోలింగ్ ఈ కేసులో అసలు బాధితులు ఎవరో తేల్చలేనంత గందరగోళాన్ని సృష్టిస్తోంది.సాధారణంగా ఏదైనా కేసు నమోదైనప్పుడు దర్యాప్తుకు సహకరించాల్సిన బాధ్యత నిందితులపై ఉంటుంది. అయితే, బుధవారం సిట్ విచారణకు భగీరథ్ హాజరుకాలేదు. హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ పూర్తయిన తర్వాత వచ్చేలా రెండు రోజుల తరవాత వస్తానని సమాచారం పంపారు. బండి సంజయ్ రాజకీయంగా తనను ఎదుర్కోలేకనే తన కుమారుడిని బలి చేస్తున్నారని, ఇది తనపై జరుగుతున్న పొలిటికల్ హిట్ జాబ్ అని ఆరోపిస్తున్నారు. అధికార పక్షం మాత్రం.. నేరం చేసింది ఎవరైనా చట్టం ముందు సమానమేనని, బాధితురాలికి న్యాయం జరగాల్సిందేనని పట్టుబడుతోంది. మరో వైపు బీఆర్ఎస్ నేతలు బండి సంజయ్‌ను టార్గెట్ చేస్తున్నారు. ఆయన రాజీనామా చేయాలంటున్నారు. ఈ రాజకీయ యుద్ధంలో బాధితురాలి కుటుంబానికే ఎక్కువ సమస్యలు వస్తున్నాయి. రాజకీయ నాయకులు ఒకరిపై ఒకరు బురద చల్లుకునే క్రమంలో, బాధితురాలి గుర్తింపును గానీ, ఆమె మానసిక స్థితిని గానీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీలోని కొందరు నేతలు ఈ సమస్యను పరిష్కరించడానికి వివాహం వంటి వింత సలహాలు ఇవ్వడం, దానికి టీపీసీసీ ఖండన తెలపడం వంటివి చూస్తుంటే.. ఈ అంశం ఎంతటి అయోమయానికి గురైందో అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో నేతలను వ్యక్తిగతంగా దెబ్బతీయడానికి వారి పిల్లలను, కుటుంబ సభ్యులను వాడుకునే సంస్కృతి పెరిగిపోవడం ఆందోళనకరమన్న అభిప్రాయం వినిపిస్తోంది. అది భగీరథ్ అయినా, మరెవరైనా.. నేరం నిరూపితమైతే చట్టపరమైన శిక్ష అనుభవించాలి. కానీ, దర్యాప్తు పూర్తికాకముందే పోస్టర్లతో వేధించడం , రాజకీయ కుట్రలంటూ తప్పించుకునే ప్రయత్నం చేయడంపై విమర్శలు వస్తున్నాయి. చివరకు కోర్టులో తేలాల్సిన అంశాన్ని వీధి పోరాటంగా మార్చడం వల్ల వ్యవస్థల పట్ల ప్రజలకు ఉన్న నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉందన్న ఆందోళనవ వ్యక్తమవుతోంది.

# దేశంలో వేల కోట్ల లీటర్ల పెట్రోల్-డీజిల్ వాడకం

ఎటువంటి భంగం రాకుండా చూస్తోంది. అధునాతన ఈవీలు గట్టి బాడీలు, రాడార్ సెన్సార్లు, డ్రోన్ డిటెక్షన్ వంటి ఫీచర్లతో సిద్ధమవుతాయి. ఇది మాత్రమే కాకుండా, కాన్వాయ్‌లో 30-40 వాహనాలను 15-20కి తగ్గించడం ద్వారా రోడ్డు ట్రాఫిక్‌ను సులభతరం చేస్తుంది.ఈ చర్య ఇంధన ఆదాతో పాటు పర్యావరణానికి లాభదాయకం. ఒక ఈవీ వాహనం సంవత్సరానికి 5-7 టన్నుల జూ2 ఉద్గారాలను తగ్గిస్తుంది. భారతదేశం 2030 నాటికి 30 శాతం ఈవీలకు మారాలనే లక్ష్యంలో కేంద్రం చర్యలు చేపట్టింది. ఆర్థికంగా, పెట్రోల్ ధరలు రూ.100కి పైబడిన ఈ సమయంలో, కాన్వాయ్ ఖర్చు 40 తగ్గుతుంది.ఈ నిర్ణయం దేశవ్యాప్త ఈవీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను వేగవంతం చేస్తుంది, ముఖ్యంగా ఛార్జింగ్ స్టేషన్లు, బ్యాటరీ టెక్నాలజీలో పెట్టుబడులు పెరుగుతాయి. సవాళ్లుగా రహస్యత, ఛార్జింగ్ సమయాలు, సైబర్ సెక్యూరిటీ మిగిలాయి. అయినప్పటికీ, ఇది ప్రభుత్వ వాహనాలు, పౌరుల వాహనాలకు ఆదర్శంగా మారి, 'గ్రీన్ మొబిలిటీ'కి ఊతమిస్తుంది.

# కేటీఆర్‌తో భారతదేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ భేటీ





పనిచేసిన అనుభవమున్న కేటీఆర్ ఈ అంశంలో అనేక అంశాలపై చర్చించారు. ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, మరియు ఇన్నోవేషన్ రంగాల్లో హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న అభివృద్ధిపై... తెలంగాణ మరియు ఆస్ట్రేలియా మధ్య సహకారం భవిష్యత్తులో స్థానిక యువతకు మరిన్ని అంతర్జాతీయ అవకాశాలను కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాయి. భారత్ మరియు ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన మైత్రిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా ఈ చర్చలు సాగాయి. ఆస్ట్రేలియా ప్రతినిధులతో జరిగిన ఈ భేటీ పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ఈ భాగస్వామ్యం ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలకు మరియు సాంస్కృతిక బంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని పేర్కొన్నారు.

# "ఓటు హక్కు పరిరక్షణలో ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలి"



కుత్బుల్లాపూర్ మే 14(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గండిమైసమ్మ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆధ్వర్యంలో దుండిగల్ మున్సిపాలిటీకి చెందిన నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్ (ఎస్ ఐ ఆర్ ) ప్రక్రియపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఓటరు వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, అర్హులైన వారి పేర్లు ఓటరు జాబితాలో కొనసాగేందుకు కృషి చేయాలని సూచించారు. బూత్ స్థాయిలో అధికారులు, బీఎల్ఓలతో సమన్వయం కొనసాగిస్తూ ఎలాంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలను ప్రత్యక్షంగా కలిసి అవసరమైన సమాచారం అందించడం, ఓటర్లకు అవగాహన కల్పించడం, అవసరమైన పత్రాల విషయంలో సహాయం చేయడం వంటి అంశాల్లో కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటు విలువైనదని, పార్టీ బలోపేతానికి కార్యకర్తల కృషి ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అలాగే పార్టీ ఆన్లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామాలు, కాలనీలు, బస్తీల వారీగా ప్రజలను కలిసి పార్టీ సభ్యత్వం నమోదు చేయించడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. యువత, మహిళలు, కొత్తగా పార్టీలో చేరే వారికి సభ్యత్వ నమోదు ప్రక్రియను సులభంగా వివరించి, ఎక్కువ సంఖ్యలో సభ్యులను చేర్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొంటూ పార్టీ దిశానిర్దేశం మేరకు క్రమశిక్షణతో పని చేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల్లో ఉండి పార్టీ సిద్ధాంతాలను బలంగా తీసుకెళ్లాలని, కార్యకర్తల సమిష్టి కృషితో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు మరియు నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ కీలక సమావేశం
## ఓటర్ల హక్కుల పరిరక్షణకు హన్మంత్ రెడ్డి పిలుపు

కుత్బుల్లాపూర్ మే 14(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) కార్యక్రమంపై ఒక ముఖ్యమైన సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో ఓటర్ల నమోదు, కొత్త ఓటర్ల చేర్పు, ఓటర్ల జాబితాలోని తప్పుల సవరణ, పేరు--చిరునామా మార్పులు, అనవసరంగా ఓటర్ల తొలగింపులు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు తన ఓటు హక్కును కోల్పోకుండా ఉండేలా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని కొలన్ హన్మంత్ రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలాధారమని, ప్రతి పౌరుడు తన ఓటు వివరాలను తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, సందేహాలను సవివరంగా నమోదు చేసి, సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం సాధించే దిశగా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడుతుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.




## బండి సాయి భగీరథ్‌నీ తక్షణమే అరెస్టు చేయాలి
### బీవీఎం రాష్ట్ర అధ్యక్షులు భూంపల్లి రవితేజ డిమాండ్

సికింద్రాబాద్ (వాయిస్ టుడే):ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా బీవీఎం రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ ఈ నెల మే 8న బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ టెన్త్ క్లాస్ చదువుతున్న 17 సంవత్సరాల మైనర్ బాలిక కి మద్యం తాగిపించి హత్య చారం చేశాడు. ఈ విషయంపై బాధిత కుటుంబ సభ్యులు అదే రోజు సాయంత్రం మొయినాబాద్ పిఎస్ లో కంప్లైంట్ చేయడానికి వెళితే ఈ కేసులో పెద్దపెద్ద నాయకుల వారి పేర్లు ఉన్నాయి కాబట్టి. ఇలా పెద్ద నాయకుల పేర్లు ఉంటే మీకు ఇబ్బంది జరుగుతుందని మేము కంప్లైంట్ తీసుకోము అని దాదాపు 6 గంటల వరకు బాధిత కుటుంబాన్ని పిఎస్ లోనే భయభ్రాంతులకు గురి చేయడం జరిగిందన్నారు. బాధితురాలు న్యాయం కోసం పోలీస్ స్టేషన్లో చుట్టూ తిరిగితే న్యాయం దొరకని దౌర్భాగ్య పరిస్థితిలో దేశం ఉందన్నారు. ఈ బండి భగీరథ్ గతంలో మహీంద్రా యూనివర్సిటీలో కూడా మద్యం మత్తులో ఉండి ఇతర విద్యార్థులపై పిడుగులతో రౌడీగా ప్రవర్తించిన ఘటనలు చూడడం జరిగింది. ఇలాంటి రౌడీపై అమ్మాయి ఫోక్సో కేసు పెడితే బండి సంజయ్ కేంద్ర సహాయ మంత్రి అహంకారంతో FIR కాకుండా అడ్డుపడుతూ కొడుకును కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ ఘటనపై బీజేపీ రాష్ట్ర ఎమ్మెల్యేలు ఎంపీలు మౌనం వహించడం సిగ్గుచేటు అని బాధితురాలి పక్షణ ఉండాలని బాధితురాలికి న్యాయం జరిగే వరకూ బిజెపి ఎమ్మెల్యేలు బిజెపి ఎంపీలు పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. పేదవారికి ఒక న్యాయం రాజకీయ నాయకులకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. మైనర్ బాలికకు న్యాయం న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా బాధితురాలికి న్యాయం జరిగే వరకూ ఐక్య విద్యార్థి ఉద్యమాలు చవిచూడక తప్పదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీవీఎం నాయకులు మనోజ్ కిషోర్ పాండు శ్యామ్ రాహుల్ అవినాష్ శ్రీమాన్ వినయ్ నీలేష్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.



## ఆగస్టు 16న శ్రీ గణేష్ గడ్డ సిద్ధి వినాయక దేవాలయం రాజ గోపురాల ప్రారంభోత్సవం

**సాలహారం పనులను వేగవంతం చేయండి..**

**గణేష్ గడ్డ దేవాలయం అభివృద్ధికి కృషి..**

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..**

**ఒక కోటి 50 లక్షల రూపాయల సొంత నిధులతో రాజగోపురాల నిర్మాణం..**



పటాన్ చెరు (వాయిస్ టుడే) : రుద్రారం శ్రీ గణేష్ గడ్డ శ్రీ సిద్ధి వినాయక దేవాలయం ఆవరణలో నిర్మించిన మూడు రాజగోపురాలను ఆగస్టు 16వ తేదీన ప్రారంభించబోతున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అదే రోజు ఆలయ శిఖర ప్రతిష్టాపన సైతం నిర్వహించబోతున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం గణేష్ గడ్డ దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పాలక వర్గం, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రముఖులు, ఆలయ ధర్మకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు,అధికారులతో కలిసి ఆలయ అభివృద్ధి పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడికి నాలుగు వైపుల నిర్మిస్తున్న రాజ గోపురాల నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఒక కోటి 50 లక్షల రూపాయల సొంత నిధులతో వీటిని నిర్మించినట్లు తెలిపారు. ఆలయంలో నిర్మిస్తున్న సాలహారం పనులు మందకొడిగా కొనసాగడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో వేగం పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆలయ పురోహితులు, పాలకవర్గం సూచనలతో ప్రారంభోత్సవ తేదీని నిర్ణయించినట్లు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా గుడిని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఆలయానికి అదనపు ఆదాయం అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ హరిప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీపీలు గాయత్రి పాండు, శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మోటే కృష్ణ యాదవ్, నరసింహారెడ్డి, వెంకన్న, స్థానిక కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి లావణ్య, ఆలయ కమిటీ డైరెక్టర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పటాన్చెరు నియోజకవర్గం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించండి



### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కోరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు (వాయిస్ టుడే): పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ను పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. గురువారం సాయంత్రం సంగారెడ్డి లోని కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా 2025-2026 సంవత్సరానికి సంబంధించిన స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ ద్వారా చేపట్టబోయే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని వడకపల్లి కోట అభివృద్ధి కోసం హెచ్ఎండిఏ అధికారులతో చర్చించడం జరిగిందని.. రెవెన్యూ శాఖ తరపున ఎన్ఓసి జారీ చేయాలని కోరారు. హెచ్ఎండిఏ నిధులతో కోటను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్.. ప్రజోపయోగ కార్యక్రమాలకు ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. ఈ సమావేశంలో అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



## 20న హైదరాబాద్‌లో మందుల షాపులు బంద్

హైదరాబాద్, మే 14: ఇ-ఫార్మసీ, ధరల సమస్య, కెమిస్టులు, రోగుల భద్రతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఎటువంటి నిర్దిష్టమైన విధానపరమైన చర్యలు తీసుకోకపోవడంతో ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ (ఏఐఓసీడీ) ఈ నెల 20వ తేదీన దేశ వ్యాప్తంగా ఒక రోజు బంద్ కు పిలుపునిచ్చింది. ఏఐఓసీడీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 20వ తేదీన బంద్ కు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అధ్యక్షుడు డాక్టర్ ఘిసులాల్ జైన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా జరగనున్న బంద్ పై జరిగిన ప్రత్యేక సమావేశంలో చర్చించి బంద్ కు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ వ్యాప్తంగా ఉన్న సభ్యులందరూ బంద్ లో పాల్గొని మందుల షాపులను మూసివేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ ప్రతినిధులు సంజయ్ కుమార్ మోడీ, చౌదరి, ఆనంద్ కుమార్ గౌడ్, మందా సూర్యప్రకాష్, నవనీత్ అగర్వాల్, వికాస్ అగర్వాల్, సుధీర్ గుప్తా, డి.నాగభూషణం, ఎమ్మాడి రాములు, వై.అరవింద్ కుమార్, సతీష్ కుమార్, అరవింద్ కుమార్ అగర్వాల్, మేమత్ కుమార్, రామ్ ప్రకాష్ అగర్వాల్, శరద్ గుప్తా, కేశవ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.


## రూ.1 లక్ష వరకు కంప్యూటర్ ఎడ్యుకేషన్ మెరిట్ స్కాలర్‌షిప్
### తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆన్ లైన్‌లో ధరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, మే 1 4: నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో కంప్యూటర్ ఎడ్యుకేషన్ మెరిట్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం ద్వారా 10ష్ట్ర పాస్, ఇంటర్, ఇంజినీరింగ్ , డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ డిప్లొమా మార్ప్/ గ్రేడింగ్ ఆధారంగా రూ. 1 లక్ష వరకు స్కాలర్‌షిప్ కు ఎంపిక చేయడం జరుగుతుందని హైదరాబాద్, పంజాగుట్ట లోని నేషనల్ స్కిల్ అకాడమీ డైరెక్టర్ వెంకట రెడ్డి తెలిపారు. ఈ ప్రోగ్రాం ద్వారా కంప్యూటర్ సాఫ్ట్వేర్ ఏఐ అండ్ ఎంఎల్, డేటా సైన్స్ లో పీజీ డిప్లొమా, డిప్లొమా కోర్సులతో పాటు బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, పైథాన్, మెషిన్ లెర్నింగ్ మరియు బిజినెస్ అనలిటిక్స్ ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, బ్లాక్‌చెయిన్, డీప్ లెర్నింగ్, సెలీనియం, సేల్స్‌ఫోర్స్, జావా, ఒరాకిల్, సాఫ్ట్వేర్ ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, వెబ్ డిజైన్ 100 కి పైగా కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సులకు ఆన్‌లైన్‌లో శిక్షణ, ఈ ప్రోగ్రామ్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 10ష్ట్ర పాస్, ఇంటర్ , ఇంజినీరింగ్ , డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చు. నేషనల్ స్కిల్ అకాడమీ విద్యార్థులు సరికొత్త సాఫ్ట్వేర్ టెక్నాలజీలలో తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి కంప్యూటర్ ఎడ్యుకేషన్ మెరిట్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం ద్వారా ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందిస్తోంది 100 కు పైగా కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సులు ఆన్లైన్ లో నేర్చుకునేందుకు 1 లక్ష వరకు కోర్సు ఫీజు లో రాయితీ కల్పిస్తారు. కోర్సులు ఈ-లెర్నింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో శిక్షణ అందించబడుతుంది, తర్వాత పరీక్షలను నిర్వహిస్తారు. పాస్ అయిన విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ ఆమోదించిన సర్టిఫికేట్‌ను అందుకుంటారు. కోర్సు వ్యవధి 2 నెలల నుండి 10 నెలల వరకు ఉంటుంది, సబ్జెక్ట్‌లో ఇన్ డెప్త్ నాలెడ్జ్ పొందేందుకు విద్యార్థులకు ఇది చక్కటి అవకాశంగా నిలుస్తోంది. ఈ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు విదేశాలలో అధిక వేతనాలతో ఉత్తమ ఉపాధి అవకాశాలు గలవు. ఈ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం కొరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 10వ తరగతి పాస్, ఇంటర్ , ఇంజినీరింగ్ , డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులు ఈ క్రింద తెలిపిన వెబ్సైటు లో ఆన్లైన్ ద్వారా అప్లై చేసుకోవలెను. ఆన్లైన్‌లో అప్లై చేసుకునేందుకు వెబ్సైటు: www.nationalskillacade-my.in కాంటాక్ట్ ఫోన్ నెంబర్: 9505800050



## లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కును అందజేసిన బొంగునూరి కిషోర్ రెడ్డి

కుత్బుల్లాపూర్ మే 14 (వాయిస్ టుడే ): దుండిగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డి.పోచంపల్లి లోని బొంగునురి కిషోర్ రెడ్డి తమ కార్యాలయంలో సిఎంఅర్ఎఫ్ చెక్కును,బాధిత కుటుంబ సభ్యులకు అత్యవసర చికిత్స కొరకు ఆరోగ్య శాఖ మంత్రి దూదిళ్ళ శ్రీధర్ బాబు ద్వారా,(సీఎంఆర్ఎఫ్) ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బౌరంపేట్ గ్రామానికి చెందిన సాయిరెడ్డిగారి సునీత కు,ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స కొరకు ఆర్థికంగా లేకపోవడంతో,బాధిత కుటుంబ సభ్యులు బొంగునురి కిషోర్ రెడ్డి సంప్రదించగా,వారు వెంటనే స్పందించి, (సిఎంఆర్ఎఫ్) ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వారికి 60 వేల రూపాయల చెక్కును ,వైద్య ఖర్చులకు అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు,తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ ఢ కో ఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బికేఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## శ్రీ నవగ్రహ సహిత పంచముఖి ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్న కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ మే 14(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ మహాదేవపురం డివిజన్ పరిధిలోని సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఇటీవల నూతనంగా ప్రతిష్ఠించబడిన శ్రీ నవగ్రహ సహిత పంచముఖి ఆంజనేయ స్వామి వారి దేవస్థానం లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ స్వామి వారిని దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ పంచముఖి ఆంజనేయ స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆ స్వామివారి దివ్య ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి ఆ స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద్ దుగ్యాల, రవీందర్ రెడ్డి, దిలీప్ కుమార్, సింహాచలం, వెంకట్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాధాకృష్ణ సత్యనారాయణ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# 38 లక్షల రూపాయల వైద్య వినియోగ వస్తువుల అందజేత

## సేవా సంస్థల సహకారం ప్రభుత్వ ఆసుపత్రులకు ఎంతో అవసరం

## పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




హనుమకొండ,వాయిస్ టుడే: హనుమకొండ ప్రభుత్వ మెటర్నిటీ దవాఖానాకు బన్ను ఆరోగ్య సేవ సొసైటీ ఆధ్వర్యంలో 38 లక్షల రూపాయల విలువైన వైద్య వినియోగ వస్తువులు మరియు అవసరమైన వైద్య సామగ్రిని గురువారం అందజేశారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజ కవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో సేవా దృక్పథంతో ముందుకు వచ్చే దాతలు,సేవా సంస్థలు మరింతగా పెరగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ దవాఖానలకు సేవా సంస్థల సహకారం ఎంతో అవసరమని, ముఖ్యంగా తల్లి–శిశు ఆరోగ్య పరిరక్షణలో ఇటువంటి డొనేషన్లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని,సేవా సంస్థలు అందిస్తున్న సహకారం వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ ప్రభుత్వ మెటర్నిటీ దవాఖానాలో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో గర్భిణీలు మరియు శిశువులకు వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ఈ తరుణంలో బన్ను ఆరోగ్య సేవ సొసైటీ అందజేసిన వైద్య వినియోగ వస్తువులు ఆసుపత్రి సేవల విస్తరణకు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి సామాజిక సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. బన్ను ఆరోగ్య సేవ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఇ.వి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ పేద మరియు అవసరమైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సొసైటీ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రభుత్వ దవాఖానలకు అవసరమైన వైద్య పరికరాలు, వినియోగ వస్తువులు అందించడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన చికిత్స అందేలా సహకరిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఆరోగ్య రంగంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అండగా నిలుస్తామని తెలిపారు. ప్రభుత్వ మెటర్నిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, ఆసుపత్రికి అందించిన వైద్య సామగ్రి రోగులకు మెరుగైన సేవలు అందించడంలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సొసైటీ ప్రతినిధులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహిస్తున్న జనరిక్ మెడికల్ హాల్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బన్ను ఆరోగ్య సేవ సొసైటీ అధ్యక్షుడు వీరమల్లు చంద్రజిత్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు,ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.కిరణ్ కుమారి,మేనేజర్ నీతా,మాజీ కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్,బోడ డిన్నా,వైద్యులు,ఆసుపత్రి సిబ్బంది,సేవా సంస్థ ప్రతినిధులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



## కాజీపేటలో పెరుగుతున్న అక్రమ వడ్డీ ఆరోపణలు

### బాధితుల వేదనలు... అధికారుల జోక్యం కోరుతున్న ప్రజలు

కాజీపేట (వాయిస్ టుడే) : హనుమకొండ జిల్లా కాజీపేట, మడికొండ ప్రాంతాల్లో అధిక వడ్డీపై అప్పుల వ్యవహారాలు పెరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో డబ్బులు తీసుకున్న పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు కొంతమంది బాధితులు పేర్కొంటున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం, కొంతమంది వ్యక్తులు నెలకు 10 నుంచి 15 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అప్పు తీసుకునే సమయంలో సౌకర్యంగా వ్యవహరించినప్పటికీ, తిరిగి చెల్లింపుల్లో ఆలస్యం జరిగితే ఒత్తిడి పెంచుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో మాటల దాడులు, మానసిక ఒత్తిడి ఎదురవుతున్నట్లు కుటుంబాలు చెబుతున్నాయి. మడికొండ ప్రాంతానికి చెందిన ఒక ఆటో డ్రైవర్ అప్పు తీసుకున్న తర్వాత వడ్డీ భారంతో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొన్ని పరిస్థితుల కారణంగా ఆయన తన నివాసాన్ని మార్చుకున్నట్లు సమాచారం. మరో ఘటనలో, ఆర్థిక ఒత్తిడితో ఒక వ్యక్తి అనారోగ్యానికి గురై చికిత్స పొందినట్లు స్థానిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అంశంపై కొంతమంది బాధితులు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. అయితే తమ ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

“ఈ ఘటనలపై అధికారుల స్పందన కోసం వేచి ఉన్నాం.”

అధిక వడ్డీ వ్యవహారాలపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరమైతే ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



ఖమ్మం, మే 14( వాయిస్ టుడే ): దేవాలయాలలో దొంగతనాలు చేసే అంతర్ రాష్ట్ర దొంగల ముఠా ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించ్చినట్లు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం సాయంత్రం కల్లూరు ఎస్సై హరిత తన సిబ్బందితో కల్లూరు శివారులో గల మధిర రోడ్డులో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా కనిపించిన బోలుసు ఏసుబాబు ఏ మానికల ఏసుబాబు , చేపూరి ఆదినారాయణ , తుమ్మల మురళి , ఎర్రగుంటపాడు గ్రామం వేంసూర్‌కు చెందిన ముగ్గురు నిందుతులు రెండు ద్విచక్ర వాహనాలపై వస్తూ కల్లూరు పోలీసు వారిని చూసి పారిపోవుటకు ప్రయత్నించుండగా, వారిని వెంబడించి పట్టుకొని వారి యొక్క వెలి ముద్రలను మీజణ డివైస్ లో చెక్ చేయగా, వారిలో ఇద్దరి వేలి ముద్రలు డేటా బేస్ లో మ్యాచ్ అయ్యాయని పేర్కొన్నారు. పోలీస్ డేటా బేస్ ప్రకారం ఇద్దరు గతంలో పలు దొంగతనాలు చేసి జైలుకు వెళ్లి వచ్చారని తెలిసిందని, వెంటనే వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నిందితులు రాత్రిపూట మోటార్ సైకిళ్ళ పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు మండలాల లో తిరుగుతూ దేవాలయాలను రెక్కీ చేసి ఎవరూ లేని సమయంలో వెళ్లి ఆ దేవాలయములోని హుండీలను పగులగొట్టి అందులోని డబ్బులను ఎత్తుకుపోవడం అలాగే దారి వెంట ఉన్న కిరాణా షాపులను పగలగొట్టి అందులోని సరుకులు,డబ్బులను దొంగలిస్తామని ఒప్పుకున్నారన్నారు. గత ఆరు నెలలుగా వీరు కల్లూరు మండలం చెన్నూరు, చిన్న కోరుకొండి, తల్లాడ మండలం లోని వెంకటగిరి, మధిర మండలం లోని మల్లారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని విస్సనపేట, ఆంజనేయస్వామి దేవాలయాలలో హుండీలను పగులగొట్టి అందులోని సొత్తు ను, అలాగే చెన్నూరు లోని ఒక కిరాణాషాపు లో దొంగతనం, పెనుబల్లి లోని పోస్ట్ ఆఫీస్ లో దొంగతనం చేశారు. నిందుతుల నుండి దొంగతనం చేయడానికి ఉపయోగించిన రెండు మోటార్ సైకిళ్ళు, గడ్డపారను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. చోరి కేసుల్లో నిందుతులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన డి హరిత ఎస్సై కల్లూరు, హెడ్ కానిస్టేబుల్లు నాగేంద్ర బాబు, సత్యనారాయణ, నరసింహారావు, కల్లూరు పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు.



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో జాప్యం చేయవద్దు

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే14: నిర్మల్ జిల్లా కలెక్టర్ భావేష్ మిశ్రా గురువారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. మండలాల వారిగా అనుమతులు నిర్మాణాలు అటవీ నిబంధన ల వల్ల ఆగిన ఇండ్ల వంటి అంశాలను ఆయన సమీక్షించారు. అటవీ అధికారులతో సమన్వయం చేసుకొని అటవీ అంశాలను పరిష్కరించాలని. ఇండ్ల నిర్మాణల ను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు అర్హులైన దరఖాస్తులను పై దశకు పంపా లని ఎంపీడీవోలకు సూచించారు ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డుకు మక్కల రాకపై తాత్కాలిక నిలిపివేత

### రైతులు సహకరించాలి: మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం



జమ్మికుంట మే 14 (వాయిస్ టుడే): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ రైతులకు అత్యంత కీలక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం జమ్మికుంట పత్తి మార్కెట్ యార్డులో భారీ స్థాయిలో మక్కల నిల్వలు పేరుకుపోవడంతో యార్డు పూర్తిగా నిండిపోయిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యగా మే 15, 2026 శుక్రవారం నుండి తదుపరి ప్రకటన వెలువడే వరకు మక్కలను మార్కెట్ యార్డుకు తీసుకురావద్దని మార్కెట్ కమిటీ స్పష్టం చేసింది.గత కొన్ని రోజులుగా పరిసర గ్రామాల నుంచి వేలాది క్వింటాళ్ల మక్కలు జమ్మికుంట మార్కెట్ యార్డుకు తరలివస్తుండటంతో నిల్వ స్థలం కొరత ఏర్పడింది. దీంతో యార్డులో ట్రాక్టర్లు, లారీలు భారీగా నిలిచిపోవడంతో పాటు రైతులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులు తెలిపారు. సరుకు తూకం, నిల్వ, వేలంపాటల ప్రక్రియ ఆలస్యమవుతున్న నేపథ్యంలో పరిస్థితిని నియంత్రించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

మార్కెట్ యార్డులో ఇప్పటికే నిల్వ ఉన్న మక్కలను త్వరితగతిన క్లియరెన్స్ చేసి, కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసిన అనంతరం మళ్లీ మక్కల రాకపై కొత్త తేదీ ప్రకటిస్తామని అధికారులు తెలిపారు. అప్పటి వరకు రైతులు తమ పంటను గ్రామాల వద్దనే భద్రపరుచుకోవాలని సూచించారు. రైతులు ఎలాంటి అపోహలకు గురికాకుండా అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలని మార్కెట్ కమిటీ కోరింది. అనుమతి లేకుండా మక్కలను యార్డుకు తీసుకువస్తే అనవసర ఇబ్బందులు, రవాణా ఖర్చులు, వేచి ఉండే పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ రైతుల సహకారం మార్కెట్ నిర్వహణలో ఎంతో కీలకమని పేర్కొన్నారు. మార్కెట్ యార్డులో పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చిన వెంటనే మళ్లీ కొనుగోళ్లు ప్రారంభిస్తామని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కావున సమస్త మక్కల రైతులు ఈ ప్రకటనను గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.




## రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలెక్షన్స్‌లో 3వ ర్యాంక్



బోయినపల్లి ఏప్రిల్ 14 (వాయిస్ టుడే ప్రతినిధి): గత నెల 27 న మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా హకింపేట స్పోర్ట్స్ లో జరిగిన రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలెక్షన్స్ లో బోయినపల్లి మండల కేంద్రానికి చెందిన బోయిని జ్ఞాపిక రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్ సాధించింది. తెలంగాణ రాష్ట్రము లోని 33 జిల్లా నుండి ఈ పోటీలలో విద్యార్థులు పాల్గొన్నారు. తెలంగాణ లో కేవలం 3 క్రీడా పాఠశాల మాత్రమే ఉండగా, ఈ సంవత్సరం నుండి కొత్తగా ఇంకో క్రీడా పాఠశాల ను హన్మకొండ లో స్టార్ట్ చేయడం జరిగింది. 100సీట్లు మాత్రమే ఉండే ఈ పోటీలలో జ్ఞాపిక 3వ ర్యాంక్ సాధించి కరీంనగర్ లో ఉన్న రీజినల్ స్పోర్ట్స్ స్కూల్ లో సీట్ ని ఎంపిక చేసుకుంది.జ్ఞాపిక ఎంపిక పట్ల పాఠశాల కరెస్పాండంట్ బిల్ల ఆనందం, ప్రిన్సిపాల్ బిల్ల చంద్రమౌళి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేసారు.

## నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించాలి

### టి జి ఎన్ పి డి సి ఎల్ ఎస్ ఈ వేణు మాధవ్




బోయినపల్లి ఏప్రిల్ 14 (వాయిస్ టుడే ప్రతినిధి): రైతులకు ప్రజలకు నాణ్యమైన విద్యుత్ ను అందించాలని టిజిఎన్పీడీసీఎల్ సిరిసిల్ల సర్కిల్ సూపరిండెంట్ ఇంజనీర్ వేణుమాధవ్ అన్నారు. గురువారం TGNPDCL రాజన్న సిరిసిల్ల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వేణు మాధవ్ బోయినపల్లి మండల సెక్షన్ ఆఫీస్ కు వచ్చి పలు సమస్యలు తెలుసుకొని రివ్యూ చేస్తూ, ప్రజావాణి లో వచ్చిన కంప్లైంట్ డీటెయిల్స్ తెలుసుకొని తక్షణమే పరిష్కారం చేయమని అలాగే బోయినపల్లి మండల కేంద్రంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏ ఈ ప్రశాంత్ సిబ్బంది ఉన్నారు.



## బోయినపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా కొమ్మనబోయిన సువీన్ యాదవ్



బోయినపల్లి ఏప్రిల్ 14 (వాయిస్ టుడే ప్రతినిధి): బోయినపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగ కొమ్మనబోయిన సువీన్ యాదవ్ ను నియమించినట్లు టి పి సి సి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సువీన్ తండ్రి కొమ్మనబోయిన మల్లేష్ యాదవ్ కాంగ్రెస్ పార్టీకి 18 ఏళ్ల పాటు పని చేశారు.సువీన్ యాదవ్ గతం లో 2005 నుండి 2010 ఉమ్మడి జిల్లా ఎన్ ఎస్ యు ఐ జిల్లా జనరల్ సెక్రటరీ అలాగే 2010 నుండి 2016 నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ గా పని చేశారు. ఈ సందర్భంగా సువీన్ యాదవ్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకముతో బోయినపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా నియమించిన చొప్పదండి ఎమ్మెల్యే కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం అలాగే రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ లకు కృతజ్ఞతలు తెలిపారు అలాగే మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు ప్రజాప్రతినిధులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతూ నాపై ఉంచిన ఈ బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తూ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానాని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులతో కలిసి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యమును కలిశారు. మేడిపల్లి సత్యం సువీన్ యాదవ్ ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతూ మండల ప్రజలకు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పని చేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వేరు వారిలో ఉమ్మడి జిల్లా మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ముదిగంటి సురేందర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జోగినపల్లి వెంకట రామారావు,జాగిరి శోభన్ నాయకులు ఉన్నారు.




## ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచిన హుజురాబాద్ ఏ సి పి మాధవి

### - అభినందించిన డివిజన్ పోలీస్ అధికారులు

హుజురాబాద్, మే 14 (వాయిస్ టుడే): ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌లో హుజురాబాద్ సబ్ డివిజన్‌కు గర్వకారణంగా, హుజురాబాద్ ఏసీపీ వి. మాధవి పాల్గొని టేబుల్ టెన్నిస్ విభాగంలో ప్రతిభ కనబరిచి ఒక సిల్వర్ మెడల్ మరియు రెండు బ్రాంజ్ మెడల్‌ను సాధించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ సబ్ డివిజన్ పోలీస్ అధికారులు ఆమెను సత్కరించి అభినందనలు తెలిపారు. ఏ సి పి సాధించిన ఈ విజయాలు పోలీస్ విభాగానికి గౌరవాన్ని తీసుకురావడమే కాకుండా, ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి అన్నారు. ఇలాంటి విజయాలు సాధిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుతూ పోలీస్ అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక
హైదరాబాద్
శుక్రవారం 15 మే 2026

## ఏ పి కే ఫైల్స్ క్లిక్ చేయకండి

**సైబర్ నేరగాళ్ళ పట్ల జాగ్రత్తగా ఉండాలి**

**ఇన్స్పెక్టర్ భాను ప్రకాష్**

ఖమ్మం, మే 14( వాయిస్ టుడే): ఖమ్మం పట్టణంలోని ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్ నందు సైబర్ మోసం ఫిర్యాదు పై కేసు నమోదు చేయనైనది. ఇట్టి పిర్యాదులో బాధితుడు ఖమ్మం అర్బన్ పరిధిలోని బాలాజీనగర్‌కు చెందిన వ్యక్తి తన క్రెడిట్ కార్డు మరియు బ్యాంకు ఖాతా నుండి అనధికారికంగా డబ్బుల ను సైబర్ మోసాగాలు మాయం చేసినట్లు ఫిర్యాదు నమోదు చేశారు. ఫిర్యాదుదారుడి కథనం ప్రకారం, బాధితుడికి ఒక మొబైల్ నంబర్ నుండి ఏ పి కే ఫైల్ పంపబడింది. ఆ ఫైల్‌ను ఓపెన్ చేసిన తర్వాత మొబైల్ ఫోన్ హ్యాక్ అయినట్లు భావిస్తున్నారు. అనంతరం, తన క్రెడిట్ కార్డు ద్వారా సుమారు ?1,00,000 మరియు బ్యాంకు ఖాతా నుండి సుమారు ?12,200 అనధికారికంగా లావాదేవీలు జరిగినట్లు పేర్కొన్నారు. ఇట్టి లావాదేవీల సమాచారం వచ్చిన వెంటనే బాధితుడు బ్యాంక్ కస్టమర్ కేర్‌ను సంప్రదించి, ట్రాన్సాక్షన్లను నిలిపివేయాలని కోరినట్లు తెలిపారు. వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ సెంటర్ 1930 కు ఫోన్ చేసి పిర్యాదు నమోదు చేసినట్లు గా తెలిపినరు తరువాత ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు ఇచ్చినారు ఇట్టి పిర్యాదు పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, నిరుద్యోగులను, ఇంట్లో ఉండే మహిళలు, ఇతరులకు అధిక లాబాలు వస్తాయని పెట్టుబడులు పెట్టాలని వారిని ప్రలోభపెట్టి అమాయక ప్రజల బ్యాంక్ ఖాతాల నుండి వారి ప్రమేయం లేకుండా సైబర్ నెరస్తూ లు డబ్బులను వారి ఖాతాలకు మల్లిస్తునారు. కావున పెట్టుబడులు పెట్టే ముందు వాస్తవికతను పరిశీలించి పెట్టు బడులు పెట్టాలని, అనధికారిక ఖజూని టఅశ్రీవం ను క్లిక్ చేయవదు. సైబర్ నెరగాలు ఇతర మార్గాల ద్వారా బాధితుల బ్యాంక్ ఖాతాలు ఖాళీ చేస్తారు కావున అప్రమత్తంగా వుంటే ఇట్టి సైబర్ నేరాల ను నీయంత్రించ వచ్చు అని ప్రతి ఒక్కరూ ఇట్టి సైబర్ నేరాల పై అవగాహన తో వ్యవహరించాలని అర్బన్ ఇన్స్పెక్టర్ భాను ప్రకాష్ హెచ్చరించారు..




## ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

**నాణ్యమైన విద్యతో పాటు సకల సౌకర్యాలు: ఎంఈఓ రమణయ్య**

**పమ్మి గ్రామంలో ఘనంగా**
**'బడిబాట' ర్యాలీ.. ప్రారంభించిన ఎంపీడీఓ బండి భాస్కర్**

ముదిగొండ మండలం మే 14 వాయిస్ టుడే: ప్రభుత్వ పాఠశాలలు నేడు ప్రైవేటుకు దీటుగా సకల సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) డి. రమణయ్య మరియు మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) బండి భాస్కర్ అన్నారు. గురువారం ముదిగొండ మండలం పమ్మి గ్రామంలోని ప్రాథమిక మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన 'బడిబాట' ర్యాలీని వారు ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో వారు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రమణయ్య మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లోనే పూర్వ ప్రాథమిక విద్య (ప్రీ-ప్రైమరీ) ప్రారంభించడం హర్షణీయమన్నారు. విద్యార్థులకు అవసరమైన 21 రకాల వస్తువులతో కూడిన ఎడ్యుకేషన్ కిట్‌ను ప్రభుత్వం అందజేస్తుందని, ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు 100% ఉత్తీర్ణత సాధించడమే ఇక్కడి ఉపాధ్యాయుల బోధనా పటిమకు నిదర్శనమని ఆయన కొనియాడారు. ఎంపీడీఓ బండి భాస్కర్ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యం మరియు విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని చెప్పారు. గతంలో ఉన్న మధ్యాహ్న భోజన పథకంతో పాటు, ఈ విద్యా సంవత్సరం నుండి ఉదయం పూట విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన అల్పాహారాన్ని (బ్రేక్ ఫాస్ట్) కూడా ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. సురేష్ మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా విద్యార్థుల నమోదు పెంచేందుకు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వడ్డే మాధవరావు, పంచాయతీ కార్యదర్శి రాధిక, వార్డు మెంబర్ సతీష్, ఉపాధ్యాయులు గంట్ర వెంకట రమణారెడ్డి, నాగలక్ష్మి, ఇతర ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకు సహకరించాలి

**తొర్రూరు మున్సిపల్ చైర్మన్ శ్రవణ్ కుమార్**

తొర్రూరు, మే 14 వాయిస్ టుడే : తొర్రూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంల్లోని అంబేద్కర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక విద్యా వారోత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటుచేసిన తల్లిదండ్రుల సమావేశానికి తొర్రూరు మున్సిపాలిటీ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందించే పలు రకాల విద్యా ప్రోత్సాహకాలను అంటే ఉచిత యూనిఫామ్స్,నోటు మరియు పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం, స్టూడెంట్స్ కిట్స్ ను ఉపయోగించుకోవాలనీ, ప్రభుత్వ పాఠశాలలో నమోదు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు నూతనంగా విచ్చేసిన చైర్మన్ , మధ్యాహ్న భోజన పథకం సహాయకురాలు శశిరేఖను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. అలాగే ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల నూతన నమోదు ప్రచార పోస్టర్లను ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్వాతి,సహ ఉపాధ్యాయులు,సంఘమిత్ర పరపతి సంఘం ప్రతినిధులు, తల్లిదండ్రులు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# బండి భగరధను అరెస్టు చేయాలి

**బండి సంజయ్ రాజీనామా చేయాలి**

**- సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్**

ఖమ్మం, మే 14( వాయిస్ టుడే): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రజాస్వామిక విలువలను, చట్టాన్ని, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారు. అత్యాచారాలను బహిరంగంగా సమర్థిస్తున్నారు. ధర్మం, దేశం అంటూ, మహిళలకు రక్షణ, గౌరవం అంటూ మాట్లాడే బీజేపీ నాయకులు, మంత్రులు తమ కోసం ధర్మాన్ని, దేశాన్ని, చట్టాన్ని అవహేళన చేస్తున్నారు. ధార్మిక సమావేశాలలో, హిందూ సమ్మేళనాలలో బండి సంజయ్ తన కొడుకు భగీరథ్ అరాచకాలను, అత్యాచారాలను, దౌర్జన్యాలను వెనకేసుక వస్తూ, రాజకీయ కుట్ర అంటూ, ఒక్కొక్కరి సంగతి చూస్తానంటూ రెచ్చగొడుతూ, విద్వేషం చిమ్ముతున్నారు. ధర్మరక్షణ, సనాతన ధర్మం, మహిళలకు గౌరవం అని మాట్లాడే బీజేపీ పరివారం ఈ విషయంపై నోరు మెదపకుండా, పరోక్షంగా అత్యాచారాలను సమర్థిస్తున్నారు. పోలీస్ అధికారులు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ మైనర్ బాలిక అత్యాచారాలను కప్పిపుచ్చడానికి, నీరుకార్చడానికి శత విధాలా ప్రయత్నం చేస్తున్నది. బాధితురాలి మీద, కుటుంబం మీదనే 308 / సెక్షన్ 168 కింద తీవ్రమైన కేసు అన్యాయంగా కరీంనగర్ పోలీస్ స్టేషన్లో నమోదు చేశారు. బాధితురాలు అఘోరిస్తూ, విలపిస్తున్నా- బండి భగీరథ??ప తగిన కేసు నమోదు చేయకుండా విచారణ పేరుతో సాగదీస్తున్నారు.




బండి భగీరథ్ను అరెస్టు చేయకుండా తమ అధికార రాజకీయాల పట్ల, అమాత్యుల పట్ల ప్రేమను, లొంగుబాటును ప్రదర్శిస్తున్నారు. ఇది చట్టాన్ని రక్షించాల్సిన వారు, చట్టాన్ని అధికారంలోని వారి చుట్టంగా మార్చారు. వెంటనే బండి భగీరథ్ను అరెస్టు చేయాలి. ఫోకోస కేసు నమోదు చేయాలి. అతని ఇతర అరాచకాలు, దౌర్జన్యాలు, అత్యాచారాలపై విచారించి, కేసు నమోదు చేయాలి. చట్టాన్ని రక్షించాల్సిన కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కొడుకు అరాచకాలను, అత్యాచారాలను వెనకేసుక రావడం భారత రాజ్యాంగ చట్టం ప్రకారం ప్రమాణం చేసిన దానికే విరుద్ధం. పైగా ప్రతీకారమంటూ, విద్వేషాన్ని రెచ్చగొట్టడం మరింత చట్ట ఉల్లంఘన. దీనికి బాధ్యత వహించి కేంద్ర హోం శాఖా సహాయ మంత్రి పదవికి రాజీనామా చేయాలి. ఈ కేసును నీరుగార్చే యత్నం చేయడం, బాధితురాలిపైనే 10 సం॥ల శిక్ష పడే, స్టేషన్ బెయిల్ రాకుండా పెట్టిన దుర్మార్గానికి పోలీసు అధికారులు, డీజీపీ నైతిక బాధ్యత వహించాలి. బాధితురాలిపై పెట్టిన కేసును విత్డ్రా చేసుకోవాలి. రేవంత్ రెడ్డి ఈ డ్రగ్ మాఫియా, అత్యాచారాల నేరస్థుల పట్ల సాచివేత వైఖరిని విడనాడాలి. కఠినంగా వ్యవహరించాలి. చట్టం ముందు అందరూ సమానులే అనే ధర్మాన్ని పాటించాలి. సామాన్యులకు ఒక న్యాయం, అమాత్యులకు మరొక పక్షపాత న్యాయం అమలు చేయడం సరికాదు.

బాధితురాలికి సంఘీభావంగా, భగీరథ్ను అరెస్టు చేయాలని, బండి సంజయ్ రాజీనామా చేయాలని 14, 15 తేదీలలో అన్ని స్థాయిలలో నిరసనలు తెలియజేయాలని పార్టీ శ్రేణులను, ప్రజలను కోరుతున్నాము. మొక్క, వరి ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలి. ఎకరాకు 45 క్వింటాళ్ళ మొక్కజొన్న పండింది. కానీ ప్రభుత్వం ఎకరాకు 20 క్వింటాళ్ళు కొంటున్నది. ఇది అన్యాయం. అలానే గోనె సంచుల కొరతను నివారించలేదు. కొనుగోళ్ళు నత్తనడకన నడుస్తున్నాయి. రైతులు పంటలు ఆరబోసి, వర్షానికి తడిసి అంగోస పడుతున్నారు. కొందరు ఆందోళనతో ఆత్మహత్యల వైపు నెట్టబడుతున్నారు. అలానే వరి పంట కొనుగోళ్ళలో కూడా తీవ్ర జాప్యం జరుగుతున్నది. లోడింగ్, అన్ లోడింగ్, తూకాలలో కూడా నిర్లక్ష్యం కొనసాగి, గంటల, రోజుల తరబడి రైతులు నిరీక్షించాల్సి వస్తున్నది. ప్రభుత్వం రైతు పంటను మొత్తం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాము. రైతు పంటనే శీఘ్రంగా తూకాలు వేయాలి. వారి బిల్లులు కూడా తక్షణమే చెల్లించాలి. గోనే సంచులు, హమాలీల కొరతను నివారించాలి. రైతు పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అలానే తడిసిన మొక్క, వరి మొత్తం పంటలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేయాలి. ఈ ప్రెస్మీట్లో ఆవుల వెంకటేశ్వర్లు, సి.వై. పుల్లయ్య, జి. రామయ్య, ఆవుల అశోక్, సిహెచ్. శిరోమణి, ఝాన్సీ, శోభ, తదితరులు పాల్గొన్నారు.



## పంట అవశేషాలు తగలబెట్టొద్దు - రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

**ఎస్ విజయచంద్ర వ్యవసాయ సహాయ సంచాలకులు, మధిర**

ముదిగొండ మండలం మే 14 వాయిస్ టుడే: గురువారం వనంవారి కిస్టాపురం మరియు కమలాపురం గ్రామాలలో రైతుల సమావేశం నిర్వహించి మధిర వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్ విజయ్ చంద్ర పలు సూచనలు చేశారు. రైతులు ఎవరు పంట అవశేషాలు తగలపెట్టవద్దని దాని వలన భూమిలో మేలు చేసే సూక్ష్మ జీవులు చనిపోవటమే కాకుండా భూ భౌతిక పరిస్థితి పాడవుతుందని దాని వలన భూమిలో ఉన్న సేంద్రియ పదార్థం నాశనమై పంట దిగుబడి తగ్గుతుందని రైతులకు తెలియజేశారు. అలాగే పంట అవశేషాలు కాలపెట్టడం వలన ఆస్తులు కూడా తగలబడే అవకాశం ఉందని కాబట్టి ఎవరు పంట అవశేషాలు తగలబెట్టొద్దని తెలియజేశారు. అలాగే రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ అమలు కావాలన్నా యూరియా కొనుగోలు చేయాలన్న మరియు పిఎం కిసాన్ డబ్బులు జమ కావాలన్నా కచ్చితంగా ఫార్మా రిజిస్ట్రి చేసుకోవాలని రైతులను కోరారు. రైతులంతా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా రాత్రిపూట గ్రామాలలోకి ఆటోలలో వచ్చి విత్తనాలు ఎవరైనా విక్రయించినట్లయితే వెంటనే సంబంధిత వ్యవసాయ అధికారి ఫిర్యాదు చేయాలని రైతులను కోరారు. అలాగే లైసెన్స్ పొందిన డీలర్ దగ్గర తప్ప మరి ఎక్కడ విత్తనాలను కొనుగోలు చేయవద్దని అలాగే కొనుగోలు చేసిన విత్తనాలకు రసీదు మరియు దాని ప్యాకెట్ చివరి వరకు దాచి పెట్టుకోవాలని రైతులకు సూచించారు. బీటీ త్రీ విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయవద్దని ఎవరైనా గ్రామాలలో బీటీ త్రీ విత్తనాలు అమ్ముతున్నట్లయితే వెంటనే ఫిర్యాదు చేయాలని తెలిపారు. అలాగే పంట మార్పిడి లో భాగంగా అందరూ ఖచ్చితంగా ఆయిల్ పామ్ వేసుకోవాలని తద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని రైతులకు సూచించారు. ఒక ఎకరానికి 50 వేల రూపాయలు సబ్సిడీ ప్రభుత్వం కల్పిస్తుందని నాలుగు సంవత్సరాల తర్వాత 30 ఏళ్ల వరకు ప్రతినెల ఆదాయం వస్తుందని కాబట్టి రైతులు ఆయిల్ ఫామ్ వైపు మొగ్గు చూపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సరిత ఏఈవోలు రవి , ఇందు భవానీ మరియు రైతులు పాల్గొన్నారు.

## డిజిటల్ అవగాహన లేకపోతే నిరక్షరాస్యులే



ఖమ్మం, మే 14( వాయిస్ టుడే): ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక లో భాగంగా విద్యా వారోత్సవాలలో నాలుగో రోజు నాలుగు విభిన్న కార్యక్రమాలు కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా ఆధ్వర్యంలో జరిగాయి.ఇంగ్లీష్- కంప్యూటర్ సైన్స్ విభాగాలు నిర్వహించిన డిజిటల్ ట్రైనింగ్ ఫర్ ఫ్యాకల్టీ కార్యక్రమంలో చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల కంప్యూటర్ విభాగాధిపతి డా.వి.సుదర్శన్ ముఖ్య వక్తగా పాల్గొని ప్రస్తుత డిజిటల్ యుగంలో వేగవంతంగా మారుతున్న సాంకేతిక మాధ్యమాలను అధ్యాపకులు ఎప్పటికప్పుడు అవగాహన తో ఉండాలని సూచించారు . అనంతరం నూతనంగా కళాశాలకు వచ్చిన ఏఈడిపి కోర్సులైన బి.కాం బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్సూరెన్స్,బి.ఎస్.సి హెల్త్ కేర్ కోర్సుల అప్రెంటిస్ షిప్ విధి,విధానాలు కోర్సుల తీరుతెన్నుల గురించి కళాశాల విద్యా కమిషనరేట్ నుంచి వచ్చిన ప్రతినిధులు అధ్యాపకుల సందేహాలను నివృత్తి చేశారు.తరువాత కళాశాల భాగ్య హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ జి.చేతన్ వడదెబ్బ,బి.పీ, షుగర్ క్యాన్సర్ గురించి అవగాహన చైతన్యాన్ని కలుగజేశారు.చివరగా ప్రస్తుతం బోధనా రంగంలో ఉన్న కళాశాల పూర్వ విద్యార్థులైన ఇల్లందు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.వై.చిన్నప్పయ్య ,మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి, నేషనల్ బెస్ట్ టీచర్ జిల్లా పాఠశాల మానిటరింగ్ ఆఫీసర్. పెసర ప్రభాకర్ రెడ్డి . వివిధ కళాశాలల్లో పనిచేస్తున్న డిగ్రీ అధ్యాపకులు పాఠశాల విద్యలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పాల్గొని తమ అపూర్వ జ్ఞాపకాలను పంచుకున్నారు విద్యా వారోత్సవాల వలన తాము చదువుకున్న కళాశాల లో అడుగులు వేయడం గొప్ప స్ఫూర్తినిస్తుందని పాత మధురాలను పంచుకున్నారు అనంతరం ఘనంగా సన్మానించారు..కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ ఏఎల్ఎన్ శాస్త్రి,డా.సీహెచ్ శ్రీనివాస్,ఐ.క్యూఏసి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద, కార్యక్రమాల సమన్వయకర్తలు,డా.జి.వీరన్న , చందా సుధాకర్, డా.ఏ నర్సమ్మ డా.షేక గౌసియా బి.వెంకటేశ్వర్లు ,డా.కె.నాగేశ్వరరావు,డా.బి.వేణుమాధవ్, వివిధ విభాగాల అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# బండి బగీరద్ దిష్టిబొమ్మ దగ్ధం

ఖమ్మం, మే 14( వాయిస్ టుడే): ఇటీవల ఒక మైనర్ బాలికకు మద్యం తాగించి హత్యాచారానికి పాల్పడ్డ బండి భగీరథ్ ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని సిపిఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో చీూ రోడ్ వద్ద బండి భగీరథ్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు . ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తనయుడు బండి భగీరద్ తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇలాంటి నీచానికి పాల్పడటం సిగ్గుచేటు అని ఈ ఘటనను యావత్తు దేశ ప్రజలందరూ ఖండిస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు అయినా లేదని నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. బండి సంజయ్ భావోద్వేగ ప్రసంగాల ద్వారా కొడుకు క్రూరుడుగా మారడని, బండి సంజయ్ ప్రసంగాల్లో కూల్చటం, చీల్చడం,తొక్కడం, చంపడం, శివాలు, శవాలు అని రెచ్చగొట్టే మాటలు మాట్లాడటం వల్ల కుమారుడు కూడా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ నేను ఏ నేరం చేసిన నన్ను ఎవరు ఏమి చేయలేదు అహంకారంతో తన తండ్రి తన వెనుక ఉన్నాడని భరోసాతో నన్ను కాపాడుతాడు అని నమ్మకంతో ఇలాంటి నిజమైన పనులకు ఒడిగడుతున్నాడని అని ఆరోపించారు. గతంలో కూడా తన తోటి విద్యార్థుల పై అరాచకంగా దాడి చేసిన ఘటనలు కూడా మన ముందున్నాయని అప్పుడే అతనిపై చర్య తీసుకుని ఉంటే ఇప్పుడు ఈ నేరానికి పాల్పడి ఉండేవాడు కాదని ఇప్పటికైనా పోలీస్ యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం అతనిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి పదవికి బండి సంజయ్ రాజీనామా చేయాలని లేని పక్షంలో కేంద్ర ప్రభుత్వం అతన్ని పదవి నుంచి తొలగించాలని నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మహిళల పట్ల బిజెపి పార్టీ ఎంత చులకన భావంతో ఉన్నదో ఎంత లెక్కలేని తనంతో ఉన్నదో అనేక ఘటనలు రుజువు చేస్తున్నాయని బిజెపి నాయకులు ఒక్కొక్కలుగా మహిళలపై విరుచుకుపడుతున్నారని మహిళలకు చదివు ఎందుకని మాట్లాడుతున్నారని మహిళలు రాజకీయాల్లోకి రాకూడదని కుట్రబుద్ధితో మహిళా రిజర్వేషన్ బిల్లును కూడా అమలు చేయడం లేదని ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, నాయకులు దొంగల తిరుపతిరావు, భుక్యా శ్రీనువాసురావు, పి నాగసులోచన, ఉపేంద్ర, మాజీ కార్పొరేటర్లు యర్రా గోపి, ఎల్లంపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



# ముదిగొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేయండి

## అమాత్యులను కోరిన రావులపాటి శ్రీనివాసరావు





ముదిగొండ మండలం మే 14 వాయిస్ టుడే: ముదిగొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం అభివృద్ధి కోసం ఆయన పట్టుదల కార్యదీక్ష సంకల్పబలం వెరసి పట్టు బట్టి తిరుగుతున్నారు కనిపించే మంత్రులకు సంబంధిత ఉన్నత అధికారులకు విన్నవించుకున్న సందర్భాలు ఎన్నో! ఎన్నెన్నో!! శాసనసభ పక్ష నాయకుడు నుండి స్థానిక మంత్రి మరియు సంబంధిత మంత్రులను కలిసి ముదిగొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామిదేవాలయ చరిత్ర దాని అభివృద్ధికి కొరకు నిధులు విడుదల తదితర అంశాలపై వినతి పత్రాలు ఇస్తూ నిరంతరం కృషి చేస్తున్న వ్యక్తి ఆయనే మన ముదిగొండ రావులపాటి! ఇప్పుడిప్పుడే దినదినాభివృద్ధి చెందుతున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం స్థానిక గ్రామ ప్రజల కృషి ప్రోత్సాహం అతన్ని మరింత బలాన్ని చేకూర్చింది! భక్తులు ఇచ్చిన ఈ చేయూతే ఎంత దూరమైనా తీసుకువెళ్తుంది నిత్యం పూజా కార్యక్రమాలు ప్రతి శనివారం స్థానికుల సందర్శన నైవేద్యం అన్నదాన కార్యక్రమాలు

ముదిగొండ దాని చుట్టుపక్క గ్రామ ప్రజలతో పాటు టూరిస్టులు సైతం మీ గుట్ట పైకి వచ్చి వెళ్తున్నారు శ్రీ లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా ఎన్నో వివాహాలు జరుగుతున్న ఇంత ఘనమైన చరిత్ర ఉన్న ఈ దేవాలయం రాష్ట్రంలో ఉన్న పలు లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాలు పక్కన ముదిగొండ దేవాలయం నిలబడుతుందన్న ప్రగాఢ విశ్వాసం నమ్మకమే ఈ దేవాలయ అభివృద్ధి కి తోడ్పాటు ఇవ్వాలని ఆ నరసింహుని రూపంలో అమాత్యులు దగ్గరకు పంపించారు ఏ అమాత్యులు లక్ష్మీ నరసింహ స్వామి రూపంలో ఆ దేవాలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తారో వేయి కళ్ళ ఎదురుచూపులతో మీ ముందుకు వచ్చాం. మా కృషి ఫలిస్తుందని! మా యొక్క సంకల్ప బలంతో మీకు వినతి పత్రం ద్వారా విన్నవించుకుంటున్నాం అన్నారు.

వివరాలకు వెళితే హైదరాబాదులోని ఈరోజు జరిగిన ఓ కార్యక్రమం ఇటీవల బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ వైస్ చైర్మన్ ప్రమాణస్వీకారం సందర్భంగా అక్కడికి ముఖ్య అతిథిగా హాజరైన దేవాదాయ శాఖ మాత్యులు కొండ సురేఖ ఐటీ మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కు ముదిగొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామిదేవాలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పలు దేవాలయాల్లో ధూప దీప నైవేద్యం కింద అయ్యవార్ల వేతనాలు మంజూరు చేయాలని వినతి పత్రం ఇవ్వడం జరిగినది సానుకూలంగా స్పందించిన మంత్రి నిధులు మంజూరు కి కృషి చేస్తామని హామీ ఇచ్చారు ఇక్కడికి హాజరైన ముదిగొండ ప్రస్తుత సిపిఐ మండల కార్యదర్శి బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు రావులపాటి శ్రీనివాసరావు మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసి వారికి మన ముదిగొండ లక్ష్మీనరసింహస్వామి చరిత్ర దాని పూర్వపరాలు తదితర అంశాలతో దేవాలయం అభివృద్ధికి నిధులను మంజూరి కొరకు వేడుకున్నారు సానుకూలంగా స్పందించిన వారు నిధులు మంజూరు కి హామీ ఇవ్వడం జరిగింది.

# జిల్లా వ్యాప్తంగా వరి కొనుగోలు కేంద్రాల వద్ద గంజా గస్తీ నిర్వహించిన నిర్మల్ పోలీసులు

నిర్మల్ జిల్లా (వాయిస్ టుడే) మే 14: జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలన, ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో ఈరోజు లి“గంజా గస్తీ”లి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లిజిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్లి నుండి హోం గార్డు వరకు ప్రతి ఒక్క పోలీస్ అధికారి, సిబ్బంది తమ తమ పోలీసు స్టేషన్ పరిధిలోని వరి కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న రైతులకు, గ్రామాల్లోని ప్రజలు, మహిళలు, యువత, ఉపాధి హామీ కార్మికులకు గంజాయి, గుడుంబా, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్ మాటేగాం వద్ద గల వరి గోదాం వద్ద రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాల పాటింపు గురించి ప్రజలకు వివరించారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి విక్రయాలు, అక్రమ మద్యం తయారీ లేదా అనుమానాస్పద కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్ భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ ఐపీఎస్, ఇన్స్పెక్టర్లు , ఎస్ఐ లు,జిల్లా లోని మిగిలిన పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.











## ఆదిలాబాద్ మార్కెట్ చైర్మన్‌ను సన్మానించిన పత్తి రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే 14: అదిలాబాద్ జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి నిర్మల్ జిల్లా మాజీ జడ్పిటిసిల ఫోరం అధ్యక్షులు పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి ని నిర్మల్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి మరియు రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అల్మాస్ ఖాన్ ఇద్దరు కలిసి బోర శ్రీకాంత్ రెడ్డి కి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే అనంతరం బోరంచ్ శ్రీకాంత్ రెడ్డి గారు పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి కి వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సన్మానం చేశారు. పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి మరియు అల్మాస్ ఖాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి ఉండి పార్టీకి కృషి చేశారు ఎనలేని సేవలు చేసినరు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క , పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ బోరంచ్ శ్రీకాంత్ రెడ్డి అదిలాబాద్ మార్కెట్ పదవి వచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

# నీతి నిజాయితీకి నిలువుటద్దం “జాన్ రెడ్డి”

## పదవి వరించకపోయినా వీడని పొంగులేటి వెన్నంటి అడుగు

నేలకొండపల్లి మండలం మే 14 వాయిస్ టుడే: రాజకీయాల్లో పదవుల కంటే నమ్మకానికి, విలువలకు ప్రాముఖ్యత ఇచ్చే నాయకులు అరుదుగా ఉంటారు. ఆ కోవకే చెందుతారు నేలకొండపల్లి మండలానికి చెందిన ప్రముఖ నాయకులు జాన్ రెడ్డి. “జాన్ రెడ్డి అంటేనే నీతి నిజాయితీకి మరో పేరు” అన్నది నేడు మండల కేంద్రంలో వినిపిస్తున్న ప్రధాన నినాదం.

### నమ్మిన బంటుగా మొదటి అడుగు

పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆత్మీయ సమ్మేళనాల్లో ప్రముఖంగా వినిపించే పేర్లలో జాన్ రెడ్డి పేరు మొదటి వరుసలో ఉంటుంది. ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో పొంగులేటి వెంట నడవడానికి కొందరు వెనుకాముందు ఆలోచించిన తరుణంలో, ఎటువంటి సంకోచం లేకుండా “నేను సైతం” అంటూ మొదటి అడుగు వేసిన నిఖార్సైన నాయకుడు జాన్ రెడ్డి. కొడాలి, భద్రయ్య వంటి కీలక నేతలతో కలిసి నేలకొండపల్లి మండలంలో పొంగులేటి అడుగులో అడుగు వేస్తూ సైనికుడిలా పనిచేశారు.

### పదవి లేకున్నా ఆగని ప్రజా సేవ

ఆత్మీయ సమ్మేళనం వేదికపై మొదటి పేరుగా పిలవబడే స్థాయి ఉన్నా, ఇప్పటి వరకు ఆయనను ఏ అధికారిక పదవీ వరించకపోవడం దురదృష్టకరమని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ పదవి ఆశించకుండా, నిరాడంబరంగా ఉంటూ, కార్యకర్తలను ముందుండి నడిపించడంలో ఆయన చూపిన చొరవ అమోఘం. కేవలం నాయకత్వం కోసమే కాకుండా, నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడటం ఆయన నైజం.

### మండల కేంద్రంలో చర్చాంశం

జాన్ రెడ్డి కష్టానికి మరియు ఆయన పడ్డ తపనకు తగిన గుర్తింపు ఎప్పుడు లభిస్తుందనేది ప్రస్తుతం మండలవ్యాప్తంగా చర్చకు దారితీసింది. పొంగులేటి శ్రీనివాస రెడ్డి మరియు దయాకర్ రెడ్డి ఈ చర్చకు త్వరలోనే ముగింపు పలుకుతారని, జాన్ రెడ్డి నిబద్ధతకు తగిన గౌరవం మరియు పదవి దక్కుతుందని అందరూ ఆశిస్తున్నారు. “కష్టే ఫలి” అన్న చందంగా, నమ్మిన బంటుగా ఉన్న జాన్ రెడ్డికి సముచిత స్థానం లభించాలని ఆకాంక్షిద్దాం.





## రైతు మహాధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే 14: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం బిజెపి ఆధ్వర్యంలో రైతులు మహా ధర్నా చేపట్టారు. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొని రహదారిపై ధాన్యాన్ని పోసి నిరసన తెలిపారు. కొనుగోలు కేంద్రంలో వరి మొక్కజొన్న పంటలు పేరుకుపోయిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రైతులకు గన్ని బ్యాగులు లారీ ట్రాన్స్పోర్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి బిజెపి నాయకులు రావుల రామనాథ్ నల్ల ఇంద్రకరణ్ రెడ్డి జింక సూరి రాచకొండ సాగర్ బీజేపీ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.



## శాంతినగర్ కేజీబీవీలో రూ.38 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే 14: నిర్మల్ జిల్లా నిర్మల్ పట్టణంలోనీ శాంతినగర్ కేజీబీవీ పాఠశాలలో రూ.38 లక్షలతో అదనపు మౌలిక వసతుల నిర్మాణానికి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇందులో పాఠశాల ప్రహరీ గోడ, టాయిలెట్స్ నిర్మాణం చేపట్టనునట్టు తెలిపారు. విద్యారంగబివృద్ధికి అవసరమైన మేర కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇ గంగాధర్, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్ , సుంకరి సాయి, పట్టణ బీజేపీ నాయకులు, కౌన్సిలర్లు గంజి రాజు, శ్రీరామోజీ నరేష్, జింక సూరి, అర్జున్,శాంశంక్, నాయకులు జమాల్, తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ గృహప్రవేశానికి హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే 14: నిర్మల్ జిల్లా కడెం మండలంలోని పెద్ద బెల్లాల్ గ్రామపంచాయతీలో జక్కుల లక్ష్మి మరియు కోడిపెల్లి రాధ లు ఇందిరమ్మ గృహప్రవేశం చేయగా వారి గృహప్రవేశానికి ముఖ్యఅతిథిగా ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పడగల భూషణ్ వారితో పాటుగా గ్రామ సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ ఈదుల తిరుపతి తక్కల రమ్య రవీందర్ చేతుల మీదుగా నూతన గృహప్రవేశం చేయడం జరిగింది వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వంలో ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు అందుతుందని అన్నారు అలాగే ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ మాజీ జెడ్పిటిసి తక్కల సత్యనారాయణ గ్రామ కమిటీ అధ్యక్షులు కాల్వ తిరుపతి మండల నాయకులు రాజేశ్వర్ జక్కుల వెంకటి గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



## ఎల్ ఓ సి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే 14: నిర్మల్ జిల్లా మామడ మండల కేంద్రానికి చెందిన రంగ మురళి మోహన్ గౌడ్ కు అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స నిమిత్తం రూ. 1 లక్ష రూపాయల సి ఎం ర్ ఫ్ ఎల్ ఓ సి చెక్కు సదరు కుటుంబ సభ్యులకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ప్రవీణ్, మండల నాయకురాలు లక్ష్మి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వాయిస్
హైదరాబాద్
శుక్రవారం 15 మే 2026

## గిరిజన తండాలకు మహర్దశ బి.టి

### రోడ్ల నిర్మాణానికి 15 కోట్ల 25 లక్షల నిధులు మంజూరు

### ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే 14: నియోజకవర్గంలో గిరిజన తండాల్లో బి. టి. రోడ్లనిర్మాణానికి 15కోట్ల 25 లక్షల రూపాయల నిధులు మంజూరు కావడం జరిగిందని లిఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్‌లి తెలియజేశారు.గురువారం ఎస్. ఎస్. జిన్నింగ్ ఫ్యాక్టరీ లోని ఆయన నివాసం లో మాట్లాడారు. తండాలు వెలిసినప్పటినుండి బి. టి. రోడ్లు లేక గిరిజన ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకోని 14.20 కిలోమీటర్లు,పొడవునా తండాలు కలుపుతూ 7 రోడ్ల నిర్మాణం చేపట్టానున్నామన్నారు. జి. వో. నెంబర్ 65 ప్రకారం ఐ. టి. డి. ఎ. ద్వారా ప్రభుత్వం పాలన పరమైన అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు.నర్సాపూర్ మండలం లో నందన్ టు నందన్ తండా రోడుకు కోటిరూపాయలు,బామ్ని టు బామ్ని తాండ రోడ్ కు 2కోట్ల రూపాయలు, కుబీర్ మండలం లో నిగ్వ టు పల్సి తండాకు 7 కోట్ల రూపాయలు, చాత టు చాత తండా 1కోటి 25 లక్షల రూపాయలు, కుంటాల మండలం లో దౌనెల్లి టు గంపూర్ తండా కు కోటి రూపాయలు, అంబకంటి టు హనుమాన్ తండా రోడ్ వంతెన నిర్మాణానికి 30 లక్షలు, మెదన్ పూర్ టు మహాదేవ్ తండా కు 2కోట్ల 70 లక్షల రూపాయల నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు.. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావ్ కు కృతజ్ఞతలు చెప్పారు.

## నిర్మల్ రూరల్, నిర్మల్ పట్టణానికి చెందిన 491 కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే 14: నిర్మల్ జిల్లా నిర్మల్ నియోజకవర్గంలోని నిర్మల్ రూరల్ 147, నిర్మల్ పట్టణం 344 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి షాది ముభారక్ చెక్కులను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో పెళ్ళైన ఆడబిడ్డలకు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామంటూ ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను అటకెక్కించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇస్తామన్న హామీలను నెరవేర్చాలని ఎక్కడికక్కడ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి, నాయకులు జమాల్, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, కౌన్సిలర్లు గంజి రాజు, శ్రీరామోజీ నరేష్, కూన శశాంక్, సాత్విక్,జింక సూరి, ఖమ్మం సురేందర్, అర్జున్, విట్టల్, ఈశ్వర్ తో పాటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## క్షేత్ర సందర్శనకు వెళ్లిన ఆయిల్ పామ్ రైతులు

కోదాడ, మే 14 (వాయిస్ టుడే ప్రతినిధి): ఆయిల్ పామ్ తోటల సాగులో మెలుకువలు తెలుసుకొనేందుకు కోదాడ, హుజుర్నగర్ డివిజన్ పరిధిలోని మండలాలకు కు చెందిన పలువురు రైతులు గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ని అశ్వారావు పేట కు క్షేత్ర సందర్శనకు వెళ్లారు. ఆయా మండలాల్లో ఆయిల్ పామ్ తోటల సాగు చేయాలనుకునే రైతులు క్షేత్ర సందర్శకు వెళ్లి ఆయిల్ పామ్ సాగుచేస్తున్న రైతులతో ముఖా ముకి చర్చించారు. ఈసందర్భంగా పంట సాగులో ఉండే కష్టా, నష్టాలు, పంట దిగుబడి, పంటను అమ్ముకునే విధానాన్ని నేరుగా అభ్యుదయ రైతులనుండి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అశ్వరావు పేట లో ఉన్న టీ జి ఆయిల్ ఫెడ్ కు చెందిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరిని రైతులు సందర్శించి అక్కడ ఉన్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకొన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆయిల్ పామ్ రైతుల తో నిర్వహించిన ఆత్మీయ సమావేశం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ఉద్యాన విస్తరణ అధికారులు రంగు ముత్యంరాజు, ఇస్మాయిల్, వంగూరి అనిల్, రైతులు చక్ర రెడ్డి, గాయం నర్సింహా రెడ్డి, రంగారావు, సుబ్బారావు, డి శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మి నారాయణ,జుకూరు రామలింగయ్య, కే వెంకటేశ్వర్ రావు, రఫీ, వీరస్వామి, నర్సింహా రావు, తో పలువురు రైతులు ఉన్నారు.



## బాటసారుల దాహార్తిని తీర్చడమే లక్ష్యం: సర్పంచ్ ప్రసన్న రాబర్ట్

మాడ్గులపల్లి మే 14 (వాయిస్ టుడే): మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలు, బాటసారుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ ఊర ప్రసన్న రాబర్ట్ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి కాలంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షకీరా బేగం, గ్రామ పెద్దలు, యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.





## ఉపాధి హామీ కార్మికులతో నిర్మల్ జిల్లా ఎస్పీ అవగాహన కార్యక్రమం

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే 14: కడెం మండలం పెద్ద బెల్లాల్ గ్రామంలో మహిళల భద్రత, మాదక ద్రవ్యాలు,సైబర్ నేరాలు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్. ఈరోజు నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మారుమూల గ్రామం అయిన పెద్ద బెల్లల్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రజా అవగాహన కార్యక్రమాన్ని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ హాజరై పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు, ముఖ్యంగా ప్రతి కుటుంబంలోని ఇంటి పెద్దలకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, అలాగే మైనర్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాల గురించి జిల్లా ఎస్పీ అవగాహన కల్పించారు. ఇంటి పెద్దలకు అవగాహన కల్పించడం ద్వారా వారు తమ పిల్లలకు సరైన మార్గదర్శనం చేసి, సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా, మైనర్ వయస్సులో వాహనాలు నడపకుండా బాధ్యతాయుతంగా ప్రవర్తించేలా సూచనలు చేయగలరని జిల్లా ఎస్పీ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత ముఖ్యమని జిల్లా ఎస్పీ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక అవగాహన కల్పిస్తూ, 18 సంవత్సరాల లోపు పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు.అదేవిధంగా గంజాయి, గుడుంబా, కల్తీ కల్లు వంటి మత్తు పదార్థాలు ఆరోగ్యంతో పాటు కుటుంబాలను కూడా నాశనం చేస్తాయని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా అక్రమ మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. గ్రామానికి స్వయంగా వచ్చి తమతో మాట్లాడి అవగాహన కల్పించడం పట్ల మహిళలు,ఉపాధి హామీ కార్మికులు, సంతోషం వ్యక్తం చేశారు.అనంతరం జిల్లా ఎస్పీ అక్కడున్న మహిళలతో ఆప్యాయంగా ముచ్చటించి, వారు తెచ్చుకున్న సద్ది లో ఏమున్నాయి అని ఆప్యాయంగా అడిగి తెలుసు కున్నారు.అనంతరం మహిళలు జిల్లా ఎస్పీ తో కలిసి సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ తో పాటు, నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్, డిఆర్డిఓ అధికారి విజయ లక్ష్మి, ఖానాపూర్ ఇన్స్పెక్టర్ అజయ్, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ వెంకట రమణ,ఎస్ఐ లు, షి టీమ్ బృందం, గ్రామస్థులు,ప్రజలు,మహిళలు, 400 మంది ఉపాధి హామీ పథకం కార్మికులు పాల్గొన్నారు.



## ఘనంగా జర్నలిస్టుల సభ్యత్వ నమోదు

### జర్నలిస్టుల హక్కుల పరిరక్షణే మా బాధ్యత

### ఐక్యంగా ఉందాం సమస్యలు పరిష్కరించుకుందాం

### జిల్లా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దాసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పిలుపు

నాగార్జునసాగర్, మే 14 వాయిస్ టుడే: జర్నలిస్టుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణే ధ్యేయంగా టీయూడబ్ల్యూజే ( ఐజేయు) పనిచేస్తుందని జిల్లా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దాసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం నాగార్జునసాగర్ పట్టణంలోని విజయ విహార్ పర్యాటక సంస్థ అతిథి గృహంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ పట్టణంలో వివిధ పత్రిక మీడియా రంగంలో పనిచేస్తున్న పలువురు జర్నలిస్టులు సభ్యత్వాన్ని తీసుకున్నారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విలేకరులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే అందరూ సభ్యత్వాలు పొంది ఉండాలని పిలుపునిచ్చారు. విలేకరులు క్షేత్రస్థాయిలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ వార్తలు సేకరించే వారికి భరోసా కల్పించడమే మా యూనియన్ లక్ష్యం. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, వంటి సౌకర్యాలు అందేలా మేము నిరంతరం కృషి చేస్తాం. వృత్తిపట్ల నిబద్ధతతో పనిచేసే ప్రతి జర్నలిస్టుకు యూనియన్ సభ్యత్వం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే వృత్తిపరమైన బాధ్యతలను నిర్వహిస్తూనే, సమాజ హితం కోసం పనిచేయాలని ఆయన కోరారు. జర్నలిస్టుల మధ్య ఐక్యత ఉంటేనే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోగలమని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పాకాల నరసింహ, చెరుకుపల్లి రాజు, గోరంట్ల శివరాం ప్రసాద్, సంఘ నాయకులు స్థానిక విలేకరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మృతి

### పార్టీ అగ్ర నాయకుల నుండి స్పందన కరువు



జమ్మికుంట, మే 14 (వాయిస్ టుడే): జమ్మికుంట మండలం ధర్మారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహమ్మద్ సలీం (46) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మహమ్మద్ సలీం ఈనెల 4న, హుజురాబాద్ మండలం పెద్ద పాపయ్యపల్లి గ్రామము నుండి తన స్వగ్రామమైన ధర్మారం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా హుజురాబాద్ హైవే రాజపల్లి- తోకలపల్లి గ్రామాల మధ్య కారు సలీం ప్రవాహనాన్ని వెనుక నుండి వచ్చి ఢీ కొట్టింది. దీంతో సమీప బంధువులకు సమాచారం రావడంతో హుజురాబాద్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడనుండి జమ్మికుంట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యుల సూచన మేరకు వరంగల్ లోని అమృత న్యూరో కేర్ సెంటర్లో చికిత్స పొందాడు. ఇక్కడ పరిస్థితి విషమించడంతో వరంగల్ లోని ఎంజిఎం ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృత్యువు తో పోరాడి గురువారం మృతి చెందినాడు. కాంగ్రెస్ పార్టీలో సలీం పాషా ఎన్ఎస్ యూఐ, యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలో చురుకైన నాయకునిగా పని చేసి మంచి పేరు సంపాదించాడు. హుజురాబాద్ నియోజకవర్గమే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులతో మంచి సత్సంబంధాలు ఉన్నాయి. సలీం తన రాజకీయ ప్రస్థానంలో ఇప్పటి వరకు ఏ పార్టీలో చేరకుండా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతూ వచ్చాడు. దాదాపు 25 సంవత్సరాలుగా కాంగ్రెస్పార్టీలో పనిచేస్తూ వస్తున్నాడు. అయితే రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏ ఒక్క అగ్ర నాయకుడు కూడా సలీంను పరామర్శించిన పాపాన పోలేదు. అయితే సలీం చికిత్స పొందుతున్న అప్పటి నుండి అతని సన్నిహితులు, స్నేహితులు మాత్రమే ప్రతినిత్యం యోగక్షేమాలను తెలుసుకుంటూ వచ్చారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుల నుండి స్పందన రాకపోవడంతో జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక, హుజురాబాద్, హనుమకొండ జిల్లాలోని కమలాపూర్ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పలు విధాలుగా చర్చించుకుంటూ అగ్ర నాయకుల తీరుపై అసహన వ్యక్తం చేస్తున్నారు.

## రాజకీయ లబ్ధికోసం కేంద్రీయ విద్యాలయ వివాదం చేస్తున్నారు

### వాలంతారి కాపాడే భద్యత ఎంపీపై ఉంది

### ఇంటిగ్రేటెడ్ స్కూల్,తెచ్చాం

### బీజేపీ పాలిత రాష్ట్రాలలో ధాన్యం కొంటాలే

### నేషనల్ హైవే 61పై వంతెనల మంజూరు లేదు

### రాయికల్ ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్



ప్రతి పేద విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను జగిత్యాల నియోజకవర్గానికి ముఖ్యమంత్రి సహకారంతో మంజూరు చేయించడంతో పాటు,ప్రతి పేద విద్యార్థికి పొద్దున్నే బ్రేక్ ఫ్రాస్ట్ తో పాటు ఉన్నత కుటుంబాల విద్యార్థులతో సమానంగా పేద పిల్లలకు కూడ సమ్మర్ క్యాంప్ స్కూల్ ను ఏర్పాటు చెయ్యడంతో పాటు పదవ తరగతి పెయిల్ అయిన పిల్లల కోసం లిరెమిడీయస్‌లి క్లాస్ లు ఏర్పాటు చేశాం అని ముఖ్యంగా జగిత్యాల నియోజకవర్గంలో మెడికల్ గత ప్రభుత్వం మంజూరు చేసిన కానీ నిధులు రాకపోతే ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ద్వార అరవై కోట్ల నిధులు మంజూరు చేసిందని అదే సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధికి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ తో పాటుగా రూరల్ సెల్ఫ్ ఎప్లాయిమెంట్ ట్రయినింగ్ ఇన్స్ ట్యూట్ ,ఏటీసీ సెంటర్ కు ఆరు కోట్లతో యూనియన్ బ్యాంక్ అప్ ఇండియా తెలంగాణ ప్రభుత్వ కేంద్ర ప్రభుత్వం సంయుక్త భాగసౌమ్యంతో దానికి అత్యంత పది కోట్ల విలువైన స్థలాన్ని ఇవ్వడం జరిగింది అని ,అలాగే అనేక వృతి విద్యా శిక్షణ తరగతులు నిర్వహించడంతో పాటు రెండు వందల కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ జగిత్యాలకు వచ్చినది దాంతో పాటుగా ఎంపీ అరవింద్ ను జగిత్యాల నియోజకవర్గంకు నవోదయ స్కూల్ అడిగిన కానీ ఆయనకు ఓట్లు కోరుట్ల లో ఓట్లు ఎక్కువ వచ్చాయని నవోదయ ఇచ్చి ,తక్కువ ఓట్లు వచ్చాయని చిన్న కేంద్రీయ విద్యాలయం ను జగిత్యాల నియోజకవర్గానికి ఇచ్చారు అని అట్టి స్కూల్ కేవలం డే స్కాలర్ మాత్రమే అందులో ముఖ్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగస్తుల పిల్లలకే ప్రాధాన్యత ఉంటుంది ,వారికోటా భర్తీ అయ్యాక సిట్ లు మిగిలితే ఇతర విద్యార్థులకు అవకాశం వస్తుందని ,ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు ,కేంద్రీయ విద్యాలయానికి స్థలం కావాలని జిల్లా కలెక్టర్ ద్వార లేఖలు పంపడం జరిగింది అని నేను ప్రత్యేకంగా మంత్రి ఉత్తంకు విజ్ఞప్తి చేశామని ,ఇంటి గ్రేటెడ్ స్కూల్ కోసం నియోజకవర్గంలో ఎక్కడయినా భూమి కేటాయించి పెట్టించగల్గుతా కానీ కేంద్రీయ విద్యాలయం చల్లాల్ పెరా జీవో తెచ్చారు.

చల్లాల్ కేంద్రీయ విద్యాలయం అడిగిన భూమి వాలంతరి అంటే వాటర్ ల్యాండ్ మేనేజిమెంట్ ట్రేనింగ్ రీసెర్చ్ ఇన్స్ ట్యూట్ భూమి నీటి పైన పరిశోధన కేంద్రం 1974-75 లో ఇరిగేషన్ వ్యవసాయ ల సంబంధితం గా అప్పటి ఇరిగేషన్ మంత్రి ప్రారంభించారు అని అప్పుడు కామెండింగ్ ఏరియా శికాధ రి అన్నారు అక్కడ చాల వ్యవసాయ నికి సంబంధించి మార్కెట్ యార్డ్ కు భూమి ఇచ్చామని రేల్వే లైన్ కు కొంత భూమి పోయింది ఇది వ్యవసాయానికి సంబంధించి రైతుల నుండి సేకరించిన స్థలం గతంలో ఇలాంటి ప్రతిపాదన చేస్తే రైతులు ఇది వ్యవసాయ పరిశోధన కె ఉండాలని నిరసన తెలిపారు మీడియాలో కూడ వచ్చినది ,దాంతో అధికారులు పెండింగ్ లో పెట్టారు అయిన కూడ నేను నాతోపాటు మంత్రి లక్ష్మణ్ కుమార్ తో ప్రభుత్వానికి భూ కేటాయింపు కోసం లేఖల ద్వార పంపడం జరిగింది అని కేంద్ర విద్యాలయం వస్తే మాకు సంతోషంగా ఉంటుంది గతంతో ఆదివాసీలకు చట్టబద్దంగా రావలసిన బోర్నపల్లి జగన్నాథ్ పూర్ వంతెన నిర్మాణం కోసం గతంలో కేంద్ర గిరిజన శాఖ మంత్రులను కలవడం జరిగింది అయిన మంజరు కాలేదు అని నేనే ఎం అన్న రాద్దాంతం చేసాన అని ప్రశ్నించారు మీ ఇంటి ముందుకు వచ్చి ధర్నా చేశామా అని నియోజకవర్గంలో ఇటిక్యాల బిడ్జి , సింగర్రావు పెట్ బిడ్జి ,అనంతరం బిడ్జి లు వర్షం వస్తే దాట నివ్వవు అని నేషనల్ హై వె 61 పరిధిలో ఉన్న ఇట్టి వంతెనలు మంజూరు చెయ్యమని అడిగాం ,మీరు రెండవ సారి ఎంపీ అంతకుముందు మీ అంకుల్ జీవన్ రెడ్డి రోడ్ల మంత్రి అయిన సమస్యలు పరిష్కారం కాలేవు అని ప్రతి విషయాన్ని రాజకీయాలు చేసి లబ్ది పొందాలి అనుకుంటే ఎట్లా అని నేను ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తున్నాం అని రేపో మాపో కొద్దీ స్థలాన్ని తగ్గించి ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో పాటు కేంద్రీయ విద్యాలయానికి స్థలం ఇవ్వమని కూడ ప్రభుత్వ కార్యదర్శితో మాట్లాడిన భూమి కేటాయింపు జరుగుతది అని ఆశిస్తున్నాం.

**బిజెపి పాలిత రాష్ట్రాలలో ధాన్యం కొంటాలేదు**

నిన్ననే మద్దతు ప్రకటించామని క్వింటాలుకు 2490 రూపాయలు మక్కలకు అన్నారు ఇక్కడ 2400 రూపాయలకు ఇక్కడ కొనుగోలు చేస్తున్నామని ఒక్క రాయికల్ మార్కెట్ లో ఇప్పటికి నలభై మూడు వెయ్యిల క్వింటలు ధాన్యాన్ని రైతుల దగ్గర కొన్నాం అని గత సంవత్సరం ఇప్పటికే ఎక్కువ ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసింది అని ఈ లెక్కన రవాణా ఛార్జి తరుగు ముక్కినవి తరుగు అన్ని తిస్తే క్వింటాల్ కు తేడ 900వందలనుండి 1000 రూపాయలు నష్టం వస్తుంది అని పదమూడు కోట్ల వరకు కేవలం మక్క రైతులకే ఇస్తున్నాం, ప్రతి క్వింటాల్ కు వెయ్యి రూపాయల వరకు ప్రతి రెతుకు లాభం అవుతుంది అని ఇంక కొనుగోలు చేసే ధాన్యం ఉన్నాయి , ఎంపీ ని అడుగుతున్నా పక్కన బిజెపి అనుబంధ ప్రభుత్వంలో ధాన్యం కొనక అట్టి ధాన్యం తెలంగాణ కు వస్తున్నాయి మధ్యప్రదేశ్ లో కొనక అక్కడి నుండి ధాన్యం తెలంగాణ వస్తుంది దాంతో తెలంగాణ రైతులకు అన్యాయం జరుతుంది అని రైతులకు 2400 కాదు 2800 బయట మార్కెట్ ధర వచ్చేది , అని మీ బిజెపి పాలిత రాష్ట్రాలలో రైతులకు అన్యాయం చేస్తు ,తెలంగాణ రాష్టం లో ప్రతిదానికి అడ్డంకిగా మారారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**